సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 17.09.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 317
పేజీలు: 08 వెల: రూ. 5



సెమీకండక్టర్ రంగానికి

## రెడ్ కార్పెట్

సింగపూర్ ప్రతినిధులతో సీఎం భేటీ

- తెలంగాణలో ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామన్న సింగపూర్ బృందం
- ఆధునిక మౌలిక వసతులు ఉన్నాయన్న ముఖ్యమంత్రి
- పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తామని హామీ

06

## మెటా మోత

సబ్‌స్క్రిప్షన్‌తో బాదుడు



- వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ యూజర్లకు అలర్ట్
- ఏఐ, కస్టమైజేషన్, ప్రొఫెషనల్ టూల్స్ కోసం పెయిడ్ ప్లాన్లు
- మూడు రకాల ప్లాన్స్

02

ధరల దూకుడుతో

# మార్కెట్‌కు దెబ్బ!

ప్రజలు కొనలేని భూమికి కోట్ల విలువ ఎందుకు?

## కోట్ల ధరలకు షాక్!



- హైదరాబాద్‌లో ఇళ్లకు డిమాండ్ తగ్గిందా?
- ప్రజలు కొనలేని ధరలెందుకు?
- రియల్ ఎస్టేట్ పై రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు
- లక్ష జీతంతో కోటి ఇల్లు ఎలా?
- ధరలు పెంచితే అమ్మకాలు తగ్గాల్సిందే!
- అద్దె ఇంటివైపే ప్రజల చూపు!
- హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు కొత్త సవాల్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
హైదరాబాద్.. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటి. ఉద్యోగాలు, వ్యాపారాలు, పెట్టుబడులు, ఐటీ రంగం.. ఇలా అన్ని రంగాల్లో నగరం దూసుకుపోతోంది. కానీ అదే సమయంలో సామాన్యుడికి మాత్రం హైదరాబాద్‌లో సొంతిల్లు అనేది రోజురోజుకూ అందని కలగా మారుతోంది. ఒకప్పుడు కష్టపడి పనిచేస్తే నగరంలో ఓ చిన్న స్థలం కొనుగోలు చేయవచ్చనే నమ్మకం ఉండేది. ఇప్పుడు మాత్రం చదువుకున్న ఉద్యోగి కూడా తన జీతంతో ఓ ప్లాట్ లేదా ఇల్లు కొనాలంటే జీవితకాలం పొదుపు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందనే చర్చ సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ధరలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. రియల్ ఎస్టేట్ ధరలను వ్యాపారులు, పెట్టుబడిదారులు తమ లాభాల కోసం ఇష్టానుసారంగా పెంచడం వల్ల సామాన్యులు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కల దూరమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఒక కార్యక్రమంలో మాట్లాడిన రంగనాథ్.. ప్రజలు కొనలేని స్థలం లేదా ఇంటికి కోట్ల రూపాయల ధర నిర్ణయించడం వల్ల చివరకు మార్కెట్‌కే నష్టం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. మార్కెట్‌లో వాస్తవమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ధరలు నిర్ణయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**కోటి కాదు.. లక్ష ఉద్యోగి పరిస్థితి?**
నెలకు లక్ష రూపాయల జీతం వచ్చే సగటు ఉద్యోగి హైదరాబాద్‌లో ప్లాట్ లేదా ఇల్లు కొనాలంటే ఎంతకాలం పని చేయాలి? అనే ప్రశ్నను



కేసీఆర్ ఫాంహౌస్ భూములను

# స్వాధీనం చేసుకుంటాం

- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణ
- నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామని సీఎం ప్రకటన
- కల్వకుంట్ల కుటుంబానికి 439 ఎకరాలు ఉన్నాయని వెల్లడి
- అసెంబ్లీలో సీఎం రేవంత్ సంచలన ప్రకటన

**ముద్ర, హైదరాబాద్ :**
కేసీఆర్ ఫాంహౌస్‌పై విచారణకు ఆదేశాలు జారీ చేస్తూ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. కేసీఆర్ ఫాంహౌస్ పరిసరాల్లో ఉన్న ప్రైవేటు భూమి ఎంత, ప్రభుత్వ భూమి ఎంత అనే లెక్క తేల్చాలని కలెక్టర్, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విచారణ పర్యవేక్షణ బాధ్యతను ముగ్గురు మంత్రులకు అప్పగించారు. నెలరోజుల్లోగా కేసీఆర్ ఫాంహౌస్ భూముల లెక్కలు తీయకపోతే అధికారులు, మంత్రులపై చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడబోమని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమి తేలితే.. అక్కడే దళితులకు పంపిణీ చేస్తామని ప్రకటించారు.
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫాంహౌస్ భూములపై విచారణకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తాజాగా తెలంగాణ అసెంబ్లీలో 22ఏ భూముల అంశంపై జరిగిన చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ సభ్యులు, సమీప బంధువుల పేర్లపై ఉన్న భూముల వివరాలను సభ ముందు రేవంత్ రెడ్డి ఉంచారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టారంటూ రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలకు తెరతీశారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లిలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్‌కు సంబంధించిన భూములపై సమగ్రంగా విచారణ జరిపి 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు.
తక్షణమే రెవెన్యూ అధికారులు.. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని, ఆ వెంటనే విచారణ చేపట్టాలని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసీఆర్ ఫాంహౌస్ భూముల విచారణను మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి,

పిల్లలకు గొప్ప

## ఆస్తి విద్యే

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

03



- ఆకలిని తరిమి.. అక్షరానికి అండగా నిలవడమే ధ్యేయం
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- కరీంనగర్‌లో రూ.8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్

తెలంగాణలో 13

## హైటెక్ బస్టాండ్లు



- షాపింగ్ నుంచి ఫుడ్ కోర్ట్ వరకు..
- ఎయిర్‌పోర్ట్ రేంజ్ సదుపాయాలు
- బస్టాండ్ల రూపురేఖలు మారిపోనున్నాయి.

02

10 మంది మావోయిస్టులకు

## ఉరిశిక్ష

2013 దాడిలో 27 మంది మృతి



- 11 మంది మావోయిస్టులు నిందితులు
- ఒకరు మృతి, 10 మందికి శిక్ష
- ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వాన్ని కుదిపేసిన ఘటనపై దశాబ్దం తర్వాత తీర్పు

02

అంతర్జాతీయ జలాల్లో పాకిస్తాన్

## బరితెగింపు

02

భారత నౌకను ఢీకొట్టిన పాక్ నేవీ

- కేంద్రం సీరియస్.. పాక్ రాయబారికి సమన్లు
- అరేబియా సముద్రంలో ఉద్రిక్తత



## యూపీఐపై ఎండీఆర్ ఛార్జీ

యూపీఐ ఛార్జీలపై కాంగ్రెస్ ఫైర్

02

- 'యూపీఐ ట్యాక్స్' అంటూ రాహుల్ తీవ్ర విమర్శలు..
- యూపీఐ ఎండీఆర్‌పై కేంద్రం క్లారిటీ
- రూ.2 వేల పైన 0.4% ఛార్జీ
- విదేశీ ఒత్తిళ్లు లేవన్న కేంద్రం




నన్ను బెదిరించే వారు ఇంకా

## పుట్టలేదు

భూముల కబ్జాపై బండి వ్యాఖ్యలు



- కేసీఆర్ వార్నింగ్ ఇస్తే భయపడను
- కేసీఆర్ కుటుంబంపై తీవ్ర ఆరోపణలు
- ధరణి అక్రమాలపై ఫైర్

03

## ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

- రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఈవీ బస్సులు అందించిన రిలయన్స్, భారత్ బయోటెక్
- తిరుమల వచ్చే భక్తులకు ఎల్ఐసీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల బీమా
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం: సీఎం చంద్రబాబు

03

భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 17.09.2026
www.mudranews.in | @mudranews



## రాగులు.. కాల్షియానికి మంచి ఆధారం



రాగుల్లో సహజసిద్ధమైన కాల్షియం అధికంగా ఉంటుంది. ఎముకలు, దంతాల ఆరోగ్యానికి కాల్షియం అవసరం కావడంతో రోజువారీ ఆహారంలో రాగులను చేర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

## ధరల దూకుడుతో మార్కెట్‌కు దెబ్బ!

(మొదటి పేజీ తరువాయి)

రంగనాథ్ ప్రస్తావించారు. భారీ ధరల కారణంగా ఒక సాధారణ ఉద్యోగి తన జీవితకాల ఆదాయాన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు లేదా పెట్టుబడిదారులకు చెల్లించాల్సిన పరిస్థితి వస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో చదరపు అడుగు ధరలు భారీ స్థాయికి చేరుకున్నాయని, అలాంటి ధరలకు సామాన్యులు ఇళ్లు ఎలా కొనుగోలు చేయగలరని ప్రశ్నించారు. ధరలు ప్రజల కొనుగోలు శక్తికి అందకుండా పోతే సహజంగానే కొనుగోలుదారులు మార్కెట్‌కు దూరమవుతారని తెలిపారు.

**ధర పెంచితే విలువ పెరిగినట్టేనా?**

రంగనాథ్ వ్యాఖ్యల్లో ప్రధానంగా వినిపించిన అంశం ఇదే. ఒక భూమిని రూ.200 కోట్లకు కొనుగోలు చేసి, ఆ పెట్టుబడిని తిరిగి పొందేందుకు ప్రతి ఫ్లాట్‌కు భారీ ధర నిర్ణయిస్తే.. ఆ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రజలు ముందుకు రాకపోవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగితంపై ఉన్న ధర, వాస్తవ మార్కెట్ విలువ రెండూ ఒకటే కాదనే విషయాన్ని రియల్ ఎస్టేట్ రంగం గుర్తించాలని ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఒక ప్రాంతంలో ధరలు పెరుగుతున్నాయనే కారణంతో భవిష్యత్తులో పదేళ్లు, ఇరవై ఏళ్ల తర్వాత ఉండే ధరలను ఇప్పుడే అమలు చేస్తే.. అది మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందని రంగనాథ్ అభిప్రాయపడ్డారు.

**అద్దె ఇంటే మేలు అంటున్న మధ్యతరగతి**

ఇల్లు కొనడం కంటే అద్దెకు ఉండటమే మంచిదనే ఆలోచనకు కొంత మంది ప్రజలు మారుతున్నారని కూడా రంగనాథ్ పేర్కొన్నారు. ఇది కేవలం రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు.. నగరంలోని మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని ప్రతిబింబించే విషయంగా మారుతోంది. సొంతింటి కోసం సంవత్సరాల తరబడి పొదుపు చేసిన కుటుంబానికి కూడా తాము కోరుకున్న ప్రాంతంలో ఇల్లు కొనడం సాధ్యం కాకపోతే.. చివరకు అద్దె ఇంటినే ఆశ్రయించాల్సి వస్తోంది. తల్లిదండ్రులు జీవితాంతం కూడబెట్టిన పొదుపు, పిల్లల చదువులు, ఉద్యోగం, భవిష్యత్ అవసరాలు అన్నింటినీ పక్కన పెట్టి ఇల్లు కోసం భారీ రుణభారం తీసుకోవడం ప్రతి కుటుంబానికి సాధ్యం కాదు.

**రియల్ ఎస్టేట్‌కు అసలు పరీక్ష**

భూమి ధర ఎంత పెరిగిందనేది కాకుండా.. ఆ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారా? అనేదే అసలు ప్రశ్న. కొనుగోలుదారుడి సామర్థ్యాన్ని మించి ధరలు పెరిగితే.. ఆ మార్కెట్‌లో లావాదేవీలు తగ్గే అవకాశం ఉంటుంది. హైదరాబాద్ వంటి నగరంలో అభివృద్ధి, మౌలిక వసతులు, ఉద్యోగ అవకాశాలు పెరగడం సహజంగానే భూములపై డిమాండ్‌ను పెంచవచ్చు. అయితే ఆ డిమాండ్‌ను మించి ధరలు పెరిగితే పరిస్థితి ఎలా మారుతుంది? అనే చర్చ ఇప్పుడు తెరపైకి వచ్చింది. సొంతింటి కల ప్రతి మధ్యతరగతి కుటుంబానికీ ఒక భావోద్వేగం. కానీ ఆ కలకు ధర కోట్ల రూపాయలుగా మారితే.. సామాన్యుడి పరిస్థితి ఏంటి? హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌పై తాజాగా వినిపిస్తున్న ఈ ప్రశ్నకు మార్కెట్ భవిష్యత్తులో ఎలాంటి సమాధానం ఇస్తుందో చూడాలి.

## 10 మంది మావోయిస్టులకు ఉరిశిక్ష



**ముద్ర, హైదరాబాద్:**
ఛత్తీస్‌గఢ్‌లో 2013లో జరిగిన జిరామ్ ఘాట్ మావోయిస్టు దాడి కేసులో కీలక తీర్పు వెలువడింది. బస్తర్ జిల్లా జగదల్‌పూర్‌లోని ప్రత్యేక జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టు 10 మంది మావోయిస్టులను దోషులుగా నిర్ధారించి మరణశిక్ష విధించింది. నేరపూరిత కుట్ర, హత్య తదితర అభియోగాలపై ఈ తీర్పు వెలువడింది. న్యాయమూర్తి అజయ్ సింగ్ రాజ్‌పుత్ భారతీయ శిక్షాస్మృతి, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)లోని పలు సెక్షన్ల కింద నిందితులను దోషులుగా తేల్చారు.

2013 మే 25న బస్తర్, సుక్మా జిల్లాల సరిహద్దులోని జిరామ్ ఘాట్ వద్ద కాంగ్రెస్ పరివర్తన్ ర్యాలీ కాన్వాయ్‌పై 150 మందికి పైగా మావోయిస్టులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కాంగ్రెస్ సీనియర్ నేతలు మహేంద్ర కర్మ, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నందకుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేశ్, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్ సహా 27 మంది మృతి చెందారు. మరో 38 మంది గాయపడ్డారు. మృతుల్లో 10 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ దాడితో అప్పట్లో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా దెబ్బతింది.

ఈ కేసులో మరణశిక్ష పడిన 10 మంది నిందితులు ప్రమీల మోడియం, చైతు లేఖమ్ అలియాస్ మున్నా, సుమిత అలియాస్ పునెం మోడియం, ముక్క మండవి, కోసా కవాసి అలియాస్ కోసారం, ఆయత మార్కం, మద్కామి దేవా, జోగా మద్కామి, బంజామి సన్నా అలియాస్ చమ్రు, మహదేవ్ నాగ్. కేసులో మరో నిందితుడు విచారణ సమయంలో మరణించాడు. ఛార్జ్‌షీట్‌లో నిందితులుగా పేర్కొన్న మరో 28 మందిని ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితులుగా చూపించారు.

ఈ కేసులో ప్రముఖ మావోయిస్టు నేతల పేర్లు కూడా ఉన్నాయి. సీపీఐ (మావోయిస్టు) పొలిట్ బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవూజీ ఈ కేసులో ఛార్జ్‌షీట్ అయినప్పటికీ పరారీలో ఉన్న నిందితుడిగా నమోదయ్యారు. ఆయన ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలంగాణలో లొంగిపోయారు. పీఎల్‌జీఏ బెటాలియన్-1 కమాండర్‌గా మద్వి హిడ్మా తర్వాత బాధ్యతలు చేపట్టిన బార్సే దేవా కూడా ఈ కేసులో నిందితుడిగా ఉండగా.. ఈ ఏడాది జనవరిలో లొంగిపోయారు. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు గణేశ్ ఉయికే కూడా ఛార్జ్‌షీట్‌లో నిందితుడిగా ఉన్నారు. 2025, డిసెంబరులో ఒడిశాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మరణించారు.

దర్యాప్తు సంస్థ ప్రకారం.. జిరామ్ ఘాట్ దాడి ముందస్తు ప్రణాళికలో భాగంగానే జరిగింది. సీపీఐ (మావోయిస్టు) నిర్వహించిన ట్యాక్టికల్ కౌంటర్ ఆఫెన్సివ్ క్యాంపెయిన్ (టీసీఓసీ)లో భాగంగా ఈ దాడికి ప్రణాళిక రూపొందించినట్లు ఎన్ఐఏ ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. 2013 ప్రారంభంలో జరిగిన సమావేశాల్లో 'వర్గ శత్రువులను' లక్ష్యంగా చేసుకోవాలని నిర్ణయించారని, ముఖ్యంగా మహేంద్ర కర్మను లక్ష్యంగా చేసుకున్నారని దర్యాప్తు సంస్థ పేర్కొంది. అయితే తుది న్యాయ నిర్ణయం కోర్టు తీర్పు ఆధారంగానే ఉంటుంది.

దాడి సమయంలో మావోయిస్టులు మొదట కాన్వాయ్‌లోని వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మందుపాతర పేల్చినట్లు దర్యాప్తులో తేలింది. పేలుడు కారణంగా రహదారిపై భారీ గుంత ఏర్పడి, మార్గం మధ్యలో నిలిచిపోయిన లారీతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అనంతరం చుట్టుపక్కల కొండ ప్రాంతాలను ఆక్రమించిన మావోయిస్టులు దాదాపు రెండు గంటల పాటు కాన్వాయ్‌పై కాల్పులు జరిపి, గ్రెనేడ్లు విసిరినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. దాడి అనంతరం ఆయుధాలు, మందుగుండు సామగ్రి, కమ్యూనికేషన్ పరికరాలను కూడా మావోయిస్టులు తీసుకెళ్లినట్లు పోలీసు రికార్డుల్లో నమోదైంది. దాడి జరిగిన రెండు రోజులకే ఎన్ఐఏ కేసు దర్యాప్తు చేపట్టింది. 2014, సెప్టెంబర్ 25న అరెస్టయిన తొమ్మిది మంది నిందితులపై జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అనంతరం 2015 సెప్టెంబర్ 28న మరో 30 మంది నిందితులపై అనుబంధ ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. మొత్తం 11 మంది నిందితులను అరెస్టు చేయగా.. వారిలో ఒకరు విచారణ సమయంలో మరణించారు. మరో 28 మందిని పరారీలో ఉన్న నిందితులుగా కేసులో కొనసాగిస్తున్నారు.

జిరామ్ ఘాట్ కేసు విచారణ దశాబ్దానికి పైగా కొనసాగింది. ఈ కేసులో కనీసం 294 విచారణలు జరిగాయి. ఈ నెలలో తుది వాదనలు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 5న ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు దోషులపై తీర్పు వెలువరించగా.. బుధవారం శిక్ష ఖరారు చేసింది. ఈ తీర్పుతో 2013లో ఛత్తీస్‌గఢ్ రాజకీయ వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేసిన జిరామ్ ఘాట్ దాడి కేసులో అరెస్టయిన 10 మంది నిందితులకు మరణశిక్ష పడింది.

## కేసీఆర్ ఫాంహౌస్ భూములు స్వాధీనం చేసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షిస్తారని సీఎం తేల్చి చెప్పారు. కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలో సుమారు 340ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి సభలో పేర్కొన్నారు. అయితే ఈ భూమి నిజంగా ప్రభుత్వ భూమేనని అధికారుల విచారణలో తేలిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ భూమి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆ భూమి ని స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇదే సమయంలో కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములపై కూడా ప్రభుత్వం దృష్టి సారించినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ భూముల విషయంలో అగ్రికల్చర్ సీలింగ్ యాక్ట్ నిబంధనలను ప్రస్తావిస్తూ.. కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాల్సి ఉంటుందని వివరించారు. భూమి రకాన్ని బట్టి కుటుంబానికి నిర్ణీత పరిమితి ఉంటుందని చెప్పారు. సిద్దిపేట ప్రాంతంలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు.. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు.. హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు.. కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు.. జోగినిపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు ఉన్నట్లు రేవంత్ రెడ్డి సభకు వివరించారు.

అదే సమయంలో నవీన్‌రావు పేరుతో 52 ఎకరాలు.. కొండల్‌రావు పేరుతో 48 ఎకరాలు ఉన్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు.మొత్తం మీద కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణలోని 9 జిల్లాల్లోని 24 మండలాలు, 31 గ్రామాల్లో సుమారు 439 ఎకరాల భూముల వివరాలు ఉన్నాయని సీఎం సభావేదికగా వెల్లడించారు. కేసీఆర్ పేరుతో 60 ఎకరాలకు పైగా భూమి ఉందని.. కేటీఆర్ పేరుతో 49.4 ఎకరాలు.. శైలిమ పేరుతో 15 ఎకరాలు.. అలేఖ్య పేరుతో 19.3 ఎకరాలు ఉన్నట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హిమాన్షు రావు పేరుతో కూడా భూములు ఉన్నాయని సభలో తెలిపారు.

అదేవిధంగా హరీశ్‌రావు పేరుతో 20 ఎకరాలు, ఆయన సతీమణి పేరుతో 8 ఎకరాలు, కవిత పేరుతో 44 ఎకరాలు, ఆమె భర్త అనిల్ కుమార్ పేరుతో 23 ఎకరాలు ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. జోగినిపల్లి సంతోష్ కుటుంబానికి సంబంధించిన భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. సంతోష్ కుమార్ పేరుతో 18.1 ఎకరాలు, ఆయన భార్య రోహిత పేరుతో 20.23 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు.

తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో ప్రస్తావించారు. సమ్మక్క, కొమురం భీమ్‌తో పాటు సాయుధ పోరాటం చేసిన కమ్యూనిస్టు ఉద్యమకారులు, ప్రజల హక్కుల కోసం పోరాడిన అనేక మంది ఆస్తులను కోల్పోయారని పేర్కొన్నారు. ఉద్యమకారుల కుటుంబాలు కూడా నష్టపోయాయని అన్నారు. కానీ కేసీఆర్ మాత్రం తెలంగాణ ఉద్యమం పేరుతో వేల కోట్ల రూపాయల ఆస్తులు, వందల ఎకరాల భూములు సంపాదించుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. వేల కోట్ల రూపాయల కాంట్రాక్టులకు సంబంధించిన అంశాలపై కూడా చర్చ జరగాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.

## యూపీఐపై ఎండీఆర్ ఛార్జీల మంట

**ముద్ర, ఢిల్లీ :**
యూపీఐ లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మర్చంట్ డిస్కౌంట్ రేటును (ఎండీఆర్) విధించడంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇందులో ఎలాంటి విదేశీ ఒత్తిళ్లు లేవని.. తాము స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే.. అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను సృష్టించడమే ఈ కొత్త విధానం వెనుక ఉన్న లక్ష్యమని పేర్కొంది. స్వయం సమృద్ధి, సమ్మిళితమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేయడానికే ఈ ఆలోచన చేసినట్లు తెలిపింది.

రూ.2వేల్లోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలూ వర్తించబోవని, ఆపైబడిన నిర్దిష్ట లావాదేవీలకు మాత్రం 0.4 శాతం ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని ఎన్‌పీసీఐ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి ఈ ఛార్జీలు అమల్లోకి రానున్నాయని వెల్లడించింది. అలాగే, వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు (P2P), రూ.2000లోపు వ్యాపార చెల్లింపులు (P2M) ఎండీఆర్ పరిధిలోకి రావని స్పష్టంచేసింది. ఈ ఛార్జీలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని జీరో ఎండీఆర్ పాలసీని అమెరికా పేమెంట్ కంపెనీలు వ్యతిరేకిస్తున్నాయని, ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం ఈ మార్పు చేసిందని పార్టీ దుయ్యబట్టింది.

**ఇది యూపీఐ ట్యాక్స్: రాహుల్ గాంధీ**

కాగా.. ఈ ఛార్జీలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు చేశారు. దీనిని 'యూపీఐ ట్యాక్స్'గా అభివర్ణించారు. ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. అందులో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గురించి ప్రస్తావించారు. "మీరు ఏ పక్షంవైపు మొగ్గుచూపుతారని ఒకసారి ఇందిరాగాంధీకి ప్రశ్న ఎదురైంది. నేను ఎటువైపు మొగ్గుచూపను.. నిటారుగా ఉంటానని ఆమె సూటిగా బదులిచ్చారు. కానీ, మోదీ జీ భిన్నమైన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఆయన ఏ పక్షం వైపు వెళ్లకుండా.. ట్రంప్ ముందు తలవంచుతున్నారు. ప్రతి భారతీయుడిపై యూపీఐ ట్యాక్స్ విధించి, ఆ డబ్బును అమెరికాకు ఇస్తున్నారు. మోదీజీ అమెరికా ముందు తలవంచడం ఆపండి. ధైర్యం తెచ్చుకొని నిటారుగా నిల్చోండి. యూపీఐ ట్యాక్స్‌ను వెనక్కి తీసుకోండి'' అని రాహుల్ విమర్శించారు.

ఇక, నోటాకు మోదీ కొత్త అర్థం చెప్పారని కాంగ్రెస్ విమర్శించింది. NOTA- Narendras Ongoing Trump Appeasement అని పేర్కొంది. ఈ దేశ వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, మునుపటిలానే యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు లేకుండా చూడాలని డిమాండ్ చేసింది.

## మెటా మోత

**ముద్ర, న్యూఢిల్లీ:**
సోషల్ మీడియా దిగ్గజం మెటా తన యూజర్ల కోసం కొత్త సబ్‌స్క్రిప్షన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'మెటా వన్' పేరుతో తీసుకొచ్చిన ఈ సేవల్లో ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్ వినియోగదారులకు అదనపు ఏఐ సామర్థ్యాలు, కస్టమైజేషన్, ప్రొఫెషనల్ టూల్స్ అందించనున్నారు. సాధారణ ఫీచర్లు, ఉచిత మెటా ఏఐ సేవలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని మెటా స్పష్టం చేసింది.

**మూడు విభాగాల్లో ప్లాన్లు**

మెటా వన్‌లో ప్రధానంగా మూడు రకాల సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. సింగిల్ ప్రొడక్ట్ ప్లాన్లలో ఇన్‌స్టాగ్రామ్ ప్లస్ నెలకు రూ.99, వాట్సాప్ ప్లస్ రూ.79, ఫేస్‌బుక్ ప్లస్ రూ.99గా ధరలను నిర్ణయించింది. వీటితో ప్రత్యేక థీమ్స్, ఐకాన్స్, కస్టమ్ యాప్ ఐకాన్స్, ఎఫెక్ట్ స్టిక్కర్స్ వంటి అదనపు ఫీచర్లు లభిస్తాయి. వాట్సాప్‌లో మరిన్ని చాట్‌లను పిన్ చేసుకునే అవకాశం, ఇన్‌స్టాగ్రామ్‌లో కస్టమ్ డీఎం, స్టోరీ ఫాంట్స్, అదనపు రీల్స్ ఇన్‌సైట్స్, వ్యక్తిగతీకరించిన నోటిఫికేషన్లు వంటి ఫీచర్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ సింగిల్ ప్రొడక్ట్ ప్లాన్లకు ఇప్పటికే 15 మిలియన్లకు పైగా సబ్‌స్క్రిప్షన్లు, ట్రయల్స్ నమోదైనట్లు మెటా వెల్లడించింది.

**ఏఐ ఫీచర్లకు ప్రత్యేక చందా**

వ్యక్తిగత ఏఐ పవర్ యూజర్ల కోసం కోర్, ప్రీమియం పేర్లతో బండిల్ ప్లాన్లు ఉన్నాయి. వీటి ధరలు భారత్‌లో వరుసగా రూ.549, రూ.1,950 నెలకుగా ఉన్నాయి. అధునాతన ఏఐ సామర్థ్యాలను ఎక్కువగా వినియోగించుకోవాలనుకునే వారికి ఈ ప్లాన్లు ఉద్దేశించినట్లు సంస్థ తెలిపింది.

**క్రియేటర్లు, బిజినెస్‌లకు భారీ ప్లాన్లు**

డిజిటల్ క్రియేటర్లు, వ్యాపార సంస్థల కోసం Essential, Advanced, Expert, Max పేర్లతో ప్రత్యేక ప్లాన్లను అందిస్తోంది. వీటి ధరలు భారత్‌లో రూ.639 నుంచి రూ.20,990 వరకు ఉన్నాయి. అవసరాన్ని బట్టి అదనపు ప్రొఫెషనల్ టూల్స్, ఏఐ సామర్థ్యాలను వినియోగించుకునేలా వీటిని రూపొందించారు.

**గూగుల్ వన్, యాపిల్ వన్ బాటలో..**

ఏఐ మోడళ్ల అభివృద్ధి, డేటా సెంటర్ల నిర్వహణకు భారీగా ఖర్చు అవుతున్న నేపథ్యంలో టెక్ కంపెనీలు పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ల ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఇదే దిశలో మెటా కూడా అడుగులు వేస్తోంది. భవిష్యత్తులో ఎడిట్స్, ఏఐ గ్లాసెస్ వంటి మరిన్ని ఉత్పత్తులు, సేవలను మెటా వన్ పరిధిలోకి తీసుకురావాలని సంస్థ భావిస్తోంది. అయితే సబ్‌స్క్రిప్షన్ ధరలు దేశాన్ని బట్టి మారుతాయని మెటా తెలిపింది.

**భారత్‌లో 'మెటా వన్' ధరలు**

**సింగిల్ ప్రొడక్ట్ ప్లాన్స్**
Instagram Plus – ₹99/నెల
WhatsApp Plus – ₹79/నెల
Facebook Plus – ₹99/నెల

Individual + AI బండిల్స్
Core – ₹549/నెల
Premium – ₹1,950/నెల

Creator + Business ప్లాన్స్
Essential – ₹639 నుంచి
Advanced – ₹2,099 నుంచి
Expert – ₹6,399 నుంచి
Max – ₹20,990 నుంచి

## భారత నౌకను ఢీకొట్టిన పాక్ నౌక

**ముద్ర, ముంబై:**
భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అరేబియా సముద్రంలో ఇరు దేశాల నౌకాదళాలకు సంబంధించిన ఘటన చోటుచేసుకుంది. సెప్టెంబర్ 15న ఉత్తర అరేబియా సముద్రంలోని అంతర్జాతీయ జలాల్లో భారత నేవీకి చెందిన ఓ నౌకను పాకిస్థాన్ నేవీ నౌక ఢీకొట్టినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత నౌకకు పాకిస్థాన్ నౌక అధిక వేగంతో సమీపించి, సురక్షితం కాని రీతిలో మానీవర్ చేయడంతో ఈ ఘటన జరిగినట్లు భారత వర్గాలు పేర్కొన్నాయి. భారత నౌకకు పెద్దగా నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు.

ఈ ఘటనపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఛార్జ్ డి అఫైర్స్‌ను విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. సముద్రంలో సైనిక నౌకలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ సందర్భంగా 1991లో భారత్–పాక్ మధ్య కుదిరిన సైనిక కార్యకలాపాలకు సంబంధించిన ఒప్పందంలోని ఆర్టికల్ 10ను కూడా భారత్ ప్రస్తావించింది. ఇస్లామాబాద్‌లోని భారత ఛార్జ్ డి అఫైర్స్ కూడా ఈ అంశాన్ని పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద లేవనెత్తాలని కేంద్రం ఆదేశించింది. తాజా ఘటనపై పాకిస్థాన్ అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

## 13 హైటెక్ బస్టాండ్లు

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా కేవలం ప్రయాణానికే పరిమితం కాకుండా.. వ్యాపారం, వినోదం, ఇతర రవాణా వ్యవస్థలను అనుసంధానం చేస్తూ 13 నూతన హైటెక్ బస్ స్టేషన్లను నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది.




'ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ సిస్టమ్' విధానంలో ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్దనున్నారు. ప్రయాణికులకు రైల్వేతో పాటు ఇతర రవాణా వ్యవస్థలతో అనుసంధానం కల్పిస్తూ, ఎయిర్‌పోర్ట్ స్థాయి సదుపాయాలతో వీటిని తీర్చిదిద్దబోతున్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం, టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి వినూత్న ఆలోచనతో రూపొందించిన ఈ బృహత్తర ప్రాజెక్టుకు ప్రభుత్వం, రవాణా శాఖల నుంచి ఇప్పటికే అధికారిక అనుమతులు లభించాయి.

**మల్టీప్లెక్స్ రేంజ్‌లో హంగులు**

కొత్తగా నిర్మించనున్న బస్ స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యానికి పెద్దపీట వేయనున్నారు. బస్సు దిగిన తర్వాత రైల్వే లేదా ఇతర రవాణా మార్గాలను సులభంగా చేరుకునేలా మల్టీ-మోడల్ కనెక్టివిటీ కల్పించనున్నారు. అలాగే షాపింగ్, బిజినెస్ కాంప్లెక్స్‌లకు కమర్షియల్ స్పేస్‌లు అందుబాటులోకి తీసుకురానున్నారు. స్థానికంగా, ప్రముఖ వ్యాపారులు తమ వ్యాపారాలను విస్తరించుకునేందుకు ఈ వాణిజ్య సముదాయాలను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండే సమయంలో ఆహ్లాదకరమైన అనుభూతి పొందేలా ఫుడ్ కోర్టులు, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతో బస్టాండ్లు కేవలం ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశాలుగా కాకుండా.. షాపింగ్, ఆహారం, వినోదానికి వేదికలుగా మారనున్నాయి. ఈ హైటెక్ బస్టాండ్లలో షాపులు, బిజినెస్ కాంప్లెక్స్‌ల కేటాయింపుల కోసం ఆసక్తి ఉన్న వ్యాపారులు ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని సంస్థ తెలిపింది. ప్రయాణికుల రాకపోకలతో పాటు వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఈ బస్ స్టేషన్లు కేంద్రాలుగా మారేలా ప్రణాళిక రూపొందించారు.

**13 ప్రాంతాల్లో నూతన బస్ స్టేషన్లు**

తెలంగాణలో మొత్తం 13 ప్రాంతాల్లో ఈ నూతన హైటెక్ బస్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నారు. నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్‌నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం ప్రాంతాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణికులకు రవాణా మరింత సులభతరం కావడంతో పాటు బస్ స్టేషన్లు ఆధునిక హంగులతో రూపుదిద్దుకోనున్నాయి. త్వరలోనే మోడల్ బస్ స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు సంస్థ వెల్లడించింది. ప్రజా రవాణాను మరింత ఆకర్షణీయంగా మార్చే క్రమంలో RTC చేపడుతున్న ఈ హైటెక్ బస్టాండ్ల ప్రాజెక్టు ప్రయాణికులకు కొత్త అనుభూతిని అందించనుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 17.09.2026
www.mudranews.in | @mudranews



## జొన్నలు.. ఎక్కువసేపు కడుపు నిండుగా

జొన్నల్లో పీచు అధికంగా ఉండటంతో ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. దీంతో తరచూ ఆకలి వేయకుండా ఉండేందుకు, ఆహార పరిమాణాన్ని నియంత్రించేందుకు ఇవి సహాయపడవచ్చు.



# పిల్లలకు గొప్ప ఆస్తి విద్యే.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

**ముద్ర, కరీంనగర్:** పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్యేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఆకలితో తరగతులకు రాకుండా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే స్కూల్ బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమన్నారు.కరీంనగర్ మార్కెట్ యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా భాగస్వామ్యంతో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్ లోని అధునాతన యంత్రాలు, ఆహార తయారీ, పరిశుభ్రత ఏర్పాట్లను పరిశీలించారు.

ఆకలితో ఉన్న విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేరని మంత్రి అన్నారు. నాణ్యమైన అల్పాహారం అందించడం ద్వారా ఏకాగ్రత, హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు.

**49,025 మంది విద్యార్థులకు అల్పాహారం**

కరీంనగర్ కిచెన్ కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని మొత్తం 49,025 మంది విద్యార్థులకు సేవలు అందుతాయని చెప్పారు. హుస్నాబాద్ లో 16,544, కరీంనగర్ లో 16,355, మానకొండూర్ లో 8,645, చొప్పదండిలో 7,481 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని వివరించారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని తెలిపారు.

కిచెన్ లో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తదితరాలను తయారు చేసేందుకు అధునాతన యంత్రాలు, కూరగాయలు కడగడం, కట్ చేయడం, పాత్రలు శుభ్రం చేయడం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆహార నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్ ను కూడా ఏర్పాటు చేశారు. థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా పాఠశాలలకు అల్పాహారం తరలిస్తామని మంత్రి తెలిపారు. మెనూ రూపకల్పనలో NIN సహకారం తీసుకున్నట్లు చెప్పారు.

**వారంలో ఆరు రకాల అల్పాహారం**

సోమవారం ఇడ్లీ–సాంబార్, మంగళవారం పూరీ–ఆలూ కుర్మా, బుధవారం దోశ–చట్నీ, గురువారం ఉప్మా–చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ–సాంబార్, శనివారం బోండా–చట్నీ అందించనున్నారు. రోజు విడిచి రోజు పాలు కూడా అందిస్తారు. 2024 డిసెంబర్ లో కోడంగల్ లో పైలట్ గా ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగిందని మంత్రి తెలిపారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామన్నారు.



రాష్ట్రవ్యాప్తంగా 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా 23,106 ప్రభుత్వ పాఠశాలలను కార్యక్రమం పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. 31 జిల్లాల్లో 31 మెగా/కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సీఎం చెప్పిన భూముల చిట్టాపై నిజాలు నిగ్గు తేలాలి



**ముద్ర, హైదరాబాద్** : శాసనసభలో 22ఏ భూములపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పారని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత విమర్శించారు. సిద్దిపేట జిల్లాలో కవిత, ఆమె భర్త పేరు మీద 37.26 ఎకరాల భూమి ఉందని అసెంబ్లీలో సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటనపై 'ఎక్స్ ' వేదికగా కవిత స్పందించారు. "సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నా. నా కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు సీఎం చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు మించి ఒక్క గజం భూమి నాకు ఎక్కువగా ఉన్నా... ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న దానికన్నా గజం భూమి అదనంగా ఉన్నా... ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని మరోమారు స్పష్టం చేస్తున్నా'' అని కవిత తెలిపారు.

## నన్ను బెదిరించే వారు ఈ భూమ్మీద పుట్టలేదు

**- కేంద్రమంత్రి బండి సంజయ్**



**ముద్ర, కరీంనగర్:** తెలంగాణలో 60శాతం జనాభాకు భూమి లేదు.. 25లక్షల కుటుంబాలకు ఇంటి స్థలం కూడా లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ధరణి పేరుతో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా దోచుకున్నారని పాదయాత్ర సందర్భంగానే హెచ్చరించా. ఫామ్‌హౌస్ అక్రమాల గురించి మాట్లాడితే నా తల ఆరు ముక్కలుగా నరుకుతానని కేసీఆర్ అన్నారు. కేసీఆర్ నాకు వార్నింగ్ ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.. కేసీఆర్‌ను మెడపట్టి ఫామ్‌హౌస్ నుంచి బయటకు గుంజుకొచ్చిందే భాజపా. నన్ను బెదిరించే వారు ఈ భూమ్మీద పుట్టలేదు. తెలంగాణలో అధికారం మాకు రావాల్సింది.. త్రుటిలో తప్పి అటు పోయింది. ఎవరు.. ఎవరి మెడలు వంచారో తెలంగాణ ప్రజలకు తెలుసు. రాష్ట్రంలో వేల ఎకరాల భూమి కబ్జాకు గురైందని చెప్పడానికి ముఖ్యమంత్రికి వెయ్యి రోజులు పట్టిందా? ఇన్ని రోజులు డీల్ కుదరలేదా? బీఆర్ఎస్ నేతలతో సెటిల్మెంట్ కుదరనందుకు ఇప్పుడు బయటపెడుతున్నారా?'' అని బండి సంజయ్ ప్రశ్నించారు.

## ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు బయటకు తీయాలి

**- కూనంనేని సాంబశివరావు**



**ముద్ర, హైదరాబాద్:** కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందన్నారు. 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో కూనంనేని మాట్లాడారు. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను వెల్లడించాలన్నారు. భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. నిజాం హయాంలో సర్ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ఇప్పుడు ఎక్కడని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తే స్థలం లేని అందరికీ ఇవ్వొచ్చన్నారు. 22ఏ విషయంలో జరిగింది సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నట్లు తెలిపారు. దీనిలో మంత్రులు, అధికారుల పాత్ర ఎంత ఉందో తేల్చాలన్నారు.

## ఇంధన సామర్థ్యమే మరో విద్యుత్ కేంద్రం: భట్టి



**ముద్ర, హైదరాబాద్** : విద్యుత్ ఉత్పత్తితో పాటు పొదుపుపైనా దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీ నోవాటెల్‌లో జరిగిన 25వ CII ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్–2026లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అవసరం లేకుండా పొదుపు చేసే ప్రతి యూనిట్ విద్యుత్ చౌకైనదేనని పేర్కొన్నారు. ఇంధన సామర్థ్యాన్ని పర్యావరణ బాధ్యతగా మాత్రమే కాకుండా ఆర్థిక పోటీతత్వాన్ని పెంచే వ్యూహంగా చూడాలన్నారు. AI, డిజిటలైజేషన్, మెరుగైన మోటార్లు, శీతలీకరణ వ్యవస్థలతో విద్యుత్ వృథాను తగ్గించాలని సూచించారు. పరిశ్రమలు కొలవాలి.. పంచుకోవాలి.. విస్తరించాలి అని పిలుపునిచ్చారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. పెట్టుబడిదారులు డిసెంబర్‌లో జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో భాగస్వాములు కావాలని కోరారు.

## ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

**ముద్ర, హైదరాబాద్** : రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2026–27లో అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుకు ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు, గెలలకు టన్నుకు రూ.24,025 ధర అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. మరో ఆరు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లుల నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఉద్యాన రంగ అభివృద్ధికి ఈ ఏడాది సుమారు రూ.1,000 కోట్లతో కార్యాచరణ చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## హరీశ్‌రావు భూముల రిజిస్ట్రేషన్‌పై పొంగులేటి ప్రశ్నలు



**ముద్ర, హైదరాబాద్:** అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావును రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్ అనుమతి ఇవ్వడం ఏ ప్రభుత్వం చేసినా తప్పేనని అన్నారు. అలాంటప్పుడు తన మామ భూములు ఎలా రిజిస్ట్రేషన్ అయ్యాయని హరీశ్‌రావును ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నకిలీ ఎన్‌ఓసీతో భూదాన్ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. 22ఏ జాబితాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, కాంగ్రెస్ ప్రభుత్వం 47,440 ఎకరాలను జాబితా నుంచి తగ్గించిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ అక్రమాలపై త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

## రేవంత్ రెడ్డివన్నీ డైవర్షన్ రాజకీయాలు, పచ్చి అబద్ధాలు



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్ర శాసనసభలో ప్రజా సమస్యలపై గొంతు విప్పుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బురద రాజకీయాలకు తెరలేపారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జ్యేష్ఠ నాయకుడు హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సభలో ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాలను, కుంభకోణాలను కప్పిపుచ్చుకోవడానికే సీఎంతో పాటు ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. శాసనసభ వేదికగా రేవంత్ రెడ్డి మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలని, ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే ఒక పక్కా పథకం ప్రకారం సస్పెన్షన్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు.

**రూల్స్ పేరుతో కాలయాపన.. సస్పెన్షన్ వెనుక పెద్ద కుట్ర!**

గతంలో రాహుల్ గాంధీ సైతం లోక్‌సభకు టీ షర్టుపై స్టిక్కర్ వేసుకుని వెళ్లారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడాన్ని హరీష్‌రావు తీవ్రంగా తప్పుబట్టారు. లోక్‌సభ నిబంధనలు వేరు, అసెంబ్లీ నియమావళి వేరంటూ ప్రభుత్వం సాకులు చెప్పడాన్ని ఆయన ఆక్షేపించారు. తామేమీ అసెంబ్లీలోకి నిషేధిత పదాలు లేదా బూతు వ్యాఖ్యలు రాసుకున్న టీషర్టులు వేసుకుని రాలేదని, ప్రజా సమస్యలపై నిరసన తెలపడం తమ ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. తాము సభలో ఉంటే ప్రభుత్వ కుంభకోణాలు, వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే తమను కుట్రపూరితంగా సస్పెండ్ చేశారని విమర్శించారు.

**సస్పెన్షన్ ఎత్తివేస్తే సభకు వస్తాం**

మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనపై సభలో ప్రశ్నించినందుకే తమపై కక్ష సాధింపు చర్యలకు దిగారని హరీష్ రావు ఆరోపించారు. తమ ప్రశ్నలకు నేరుగా సమాధానం చెప్పే ధైర్యం లేకనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సస్పెన్షన్ అస్త్రాన్ని ప్రయోగించారని పేర్కొన్నారు. అన్యాయంగా విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేస్తే తాము తిరిగి సభకు వచ్చి ప్రజల తరఫున నిలబడతామని తమ పార్టీ సభ్యులు ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఎంతకాలం అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

## జగిత్యాల జిల్లాలో అంగన్వాడీ కార్యకర్త హత్య

**ముద్ర, జగిత్యాల** : జగిత్యాల జిల్లా కోరుట్లలో దారుణం చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రకాశం రోడ్డులో అంగన్వాడీ కార్యకర్త అన్నం లావణ్య (45) హత్యకు గురయ్యారు. లావణ్య, ఆమె భర్త నరేశ్ మధ్య కొన్ని నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం ఉదయం ఇంటి పని చేస్తుండగా లావణ్యను నరేశ్ రుమాలుతో గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం నిందితుడు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసుల ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

## ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

**రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం..**
**32 ఈవీ బస్సులు అందుబాటులోకి**
**తిరుమలకు వచ్చే భక్తులకు రూ.2 లక్షల బీమా..**
**రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం: సీఎం చంద్రబాబు**

**ముద్ర, తిరుమల** : తిరుమలను పవిత్ర దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తులకు మెరుగైన అనుభూతితో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమలలో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దాన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం ప్రారంభించారు. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారి నిత్య కైంకర్యాలు, పూజలు, తిరుమల ప్రాంతాలను త్రీడీ, వర్చువల్ రియాలిటీ సాంకేతికతతో వీక్షించే అవకాశం కల్పించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని రూ.104 కోట్లతో ఆధునీకరించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, రాజులు సమర్పించిన ఆభరణాల నమూనాలు, చారిత్రక వస్తువులు, కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను ఇందులో ప్రదర్శిస్తున్నారు. ఏఐ వీడియోలు, పనోరమిక్ స్క్రీన్లతో భక్తులకు ప్రత్యేక అనుభూతి కల్పిస్తున్నారు.భక్తుల రాకపోకల కోసం రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను కూడా సీఎం ప్రారంభించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా కల్పించనున్నట్లు తెలిపారు. తిరుమలలో భక్తుడు దురదృష్టవశాత్తూ మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ పథకం ఉంటుందన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నట్లు చంద్రబాబు తెలిపారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణంపై డిమాండ్ ఉందని, దీనిపై పరిశీలిస్తున్నామని చెప్పారు. టీటీడీ కార్యకలాపాలను ఆరు అంశాల్లో పునర్వ్యవస్థీకరిస్తామని వెల్లడించారు.



## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించండి

**సింగపూర్ కంపెనీలకు తెలంగాణలో విస్తృత అవకాశాలు**
**ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు సమావేశం**

**ముద్ర,హైదరాబాద్:** భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో మంత్రితో సమావేశమైంది.ఈ సందర్భంగా తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రి వివరించారు. ఐటీ, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్, ఆర్అండ్‌డీ, ఇన్నోవేషన్ తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో సింగపూర్ అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించి ఫ్యాబ్ పరిశ్రమలు, అనుబంధ రంగాలు, సరఫరా వ్యవస్థ అభివృద్ధికి భాగస్వామ్యం పెంచాలని కోరారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026'లో సింగపూర్ ప్రభుత్వం, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
గురువారం 17.09.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# వివాహేతర సంబంధాలు
## కారణం ఏంటి?



భారతదేశంలో వివాహేతర సంబంధాలు (Extra-marital Affairs) పెరగడానికి గల మానసిక, సామాజిక కారణాలేంటి? గ్లీడెన్, యాష్లే మాడిసన్ సర్వేలో నిజాలు మీకోసం.

ఒకరితోనే జీవితాన్ని పంచుకోవాలనే 'ఏకపత్నీ/ఏకభర్తృత్వ' భావన మన సంస్కృతిలో బలంగా నాటుకుపోయింది. అయినప్పటికీ, భారతదేశంలో వివాహేతర సంబంధాలు పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది సాంప్రదాయ, ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో వస్తున్న స్పష్టమైన మార్పును సూచిస్తోంది.

ప్రపంచంలోనే అతిపెద్ద వివాహేతర డేటింగ్ యాప్ అయిన 'గ్లీడెన్' (Gleeden) ఇటీవల ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. భారతీయ వినియోగదారుల సంఖ్య ఆ యాప్‌లో ఇప్పటికే 40 లక్షలు దాటిందట. రహస్యంగా వివాహేతర సంబంధాలను కోరుకునే వారి కోసం 2017లో ఈ యాప్ భారత మార్కెట్లోకి ప్రవేశించింది. రెండేళ్లలో ఈ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించే భారతీయ మహిళల సంఖ్య 148% పెరిగిందని ఒక సర్వేలో తేలింది.

మరోవైపు, వివాహేతర సంబంధాలకు వేదికగా నిలిచే 'యాష్లే మాడిసన్' (Ashley Madison) యాప్, జూన్ 2025 డేటా ప్రకారం తమిళనాడులోని కాంచీపురం భారతదేశంలోనే ఇలాంటి సంబంధాలకు ఒక ప్రధాన హాట్‌స్పాట్‌గా మారిందని పేర్కొంది.

డేటా ప్రకారం, వినియోగదారులు ఎక్కువగా మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు, మళ్లీ రాత్రి 10 గంటల నుండి అర్ధరాత్రి వరకు ఈ యాప్‌లలో చురుగ్గా ఉంటున్నారు. దైనందిన జీవితంలోని అలసట నుండి కాస్త విరామం కావాలనుకున్నప్పుడు లేదా ప్రశాంతంగా ఉన్న సమయాల్లో ప్రజలు ఇలాంటి 'క్యాజువల్' సంభాషణల కోసం చూస్తున్నారని ఇది సూచిస్తోంది.

మెట్రో నగరాల విషయానికొస్తే, ఈ యాప్‌ల వాడకంలో 18% మంది వినియోగదారులతో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా, హైదరాబాద్ (17%), ఢిల్లీ (11%), ముంబై (9%), పూణే (7%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. లక్నో, చండీగఢ్, సూరత్, కోయంబత్తూర్, పాట్నా, గువహటి వంటి చిన్న నగరాల్లో కూడా వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది వివాహ బంధానికి వెలుపల ఏర్పడుతున్న సంబంధాల విస్తృతిని చూపుతోంది. అయితే, వివాహేతర సంబంధాలు ఇప్పుడు సమాజంలో సాధారణ విషయాలుగా మారిపోతున్నాయా?

# ఒకే చారిత్రక ఘట్టం
## భిన్న దృక్పథాల ప్రస్థానం

తెలంగాణ విమోచన దినం.. తెలంగాణ విద్రోహ దినం.. తెలంగాణ విలీన దినం.. ప్రజాపాలనా దినోత్సవం.. ఒకే సందర్భానికి ఇన్ని భిన్నమైన పేర్లుండటం కచ్చితంగా విశేషమే.. ఒకే సందర్భాన్ని వేరు సమూహాలు వేరు వేరుగా ప్రేమగానో కోపంగానో గుర్తు చేసుకోవటం కూడా కచ్చితంగా ప్రత్యేకమే.. ఆ ప్రత్యేక విశేష సందర్భం సెప్టెంబర్ పదహేడు.. హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారత యూనియన్‌లో కలిసి, నిజాం రజాకార్ల అరాచకాలకు తెర పడిన సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలోనే అత్యంత కీలకమైన మలుపు. అయితే, కాలక్రమేణా ఈ ఒక్క రోజే వేర్వేరు రాజకీయ, సామాజిక దృక్పథాల ప్రతిబింబంగా మారి, భిన్నమైన పేర్లతో వార్తల్లో నిలుస్తోంది.

దశాబ్దాల నిజాం రాచరికం, రజాకార్ల దౌర్జన్యాల నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన రోజని సాంప్రదాయ తెలంగాణ వాదులు విమోచన దినం అనోచ్చు , బిజెపి కూడా దానిని విమోచన దినోత్సవంగా ప్రకటించి ఉత్సవాలు నిర్వహిస్తుంది. కమ్యూనిస్టుల కోణం ప్రకారం, వారి నేతృత్వంలో సాగిన వీరోచిత 'తెలంగాణ సాయుధ పోరాటం' ఫలితంగానే నిజాం దిగివచ్చాడు. కానీ, ఆ తర్వాతి యూనియన్ మిలటరీ చర్య కేవలం కమ్యూనిస్టులను, వారి భూపోరాటాలను అణచివేయడానికే జరిగిందని భావిస్తూ వారు దీనిని 'విద్రోహ దినం' లేదా 'ధోకా దివస్'గా పేర్కొంటున్నారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, చారిత్రకంగా హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో 'విలీనమైన' సందర్భాన్ని ప్రామాణికంగా గుర్తించే కోణం ఇది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సుదీర్ఘ కాలం పాటు ఈ రోజుపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17 ను 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా అధికారికంగా వేడుకలు నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఈ చారిత్రక ఘట్టానికి 'తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవం'గా నామకరణం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. రాచరిక పాలన నుంచి ప్రజల స్వయంపాలన, ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రారంభమైన రోజుగా దీనిని గుర్తు చేసుకుంటున్నారు

### భిన్న వాదనల వేదిక.. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక

ఆనాడు కేవలం లక్షా అరవై వేలమంది తెలంగాణ ప్రజల విముక్తి కోసం జరిగిన పోరాటం అది.. ఈ పోరాటంలో పాల్గొన్న వారిలో, ఆ యోధులతో సాన్నిహిత్యం ఉన్న వారిలో ఆ సందర్భం గురించిన భిన్న అభిప్రాయాలున్నాయి. ఆ రోజు పోలీసు యాక్షన్ కేవలం కమ్యూనిస్టుల మీద దాడి మాత్రమేననే వామపక్ష వాదులు ఇప్పటికీ ఉన్నారు. అసలు నిజమైన ద్రోహం కమ్యూనిస్టులు చేసిందేనని, తెలంగాణ ప్రాంతం విమోచన పొందిన తరువాత పోరాటాన్ని విరమించటమే అసలైన ద్రోహం అని వాదించే అతివాద వామపక్షవాదులు ఇంకా ఉన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలంగా వచ్చినా, పోలీసు యాక్షన్ వల్ల వచ్చినా.. ఆరోజు వచ్చింది తెలంగాణకు స్వాతంత్ర్యమే కనుక దాన్ని విద్రోహ దినం అనటం తప్పు అని.. దాన్ని విమోచనదినం అనటం సమంజసమే అని అనే వామపక్ష వాదులూ ఉన్నారు. ఈ వీరోచిత సందర్భానికి ఇన్ని అర్థాలున్నాయి కనుకనే ఈ రోజు కూడ ప్రతి స్పందనలు భిన్నంగానే ఉంటున్నాయి. మేం విద్రోహ దినాన్ని పాటిస్తాం ర్యాలీలు నిర్వహిస్తాం అంటోంది ఎంఎల్ పార్టీ.. మేం ప్రశాంతంగా విమోచనా దినాన్ని పాటిస్తాం అంటున్నాయి. మరి కొన్ని ఎర్రజెండా పార్టీలు.. రాజకీయ ప్రయోజనాలు, సిద్ధాంత ప్రాతిపదికలు ఏవైనా కావచ్చు... పేర్లు మారినా ఈ రోజు వెనుక ఉన్న నైతిక సత్యం ఒక్కటే. సెప్టెంబర్ 17 తెలంగాణ నేల స్వేచ్ఛ కోసం రక్తం చిందించిన అమరవీరుల త్యాగానికి ప్రతిరూపం.





కేవలం క్యాలెండర్‌లోని ఒక తేదీ కాదు, అణచివేతపై తిరగబడిన తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక. వేర్వేరు సమూహాలు తమ స్వరాన్ని వినిపిస్తున్నప్పటికీ, ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడమే ఈ రోజు మనకు అందించే సందేశం.

### తుపాకులపై గెలిచిన వడిసెల సైన్యం..

ఏదైనా ఆ రోజు వీరులకు వీరనారులకు ఓ అద్భుత స్మరణ.. దొడ్డి కొమురయ్య, ఐలమ్మ స్ఫూర్తితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతాలు, గోదావరి పరివాహక గ్రామాలు సాయుధ పోరాటానికి బలమైన రణరంగాలుగా మారాయి. నిజాం సైన్య మూకలను, రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కొని నిలబడిన నాటి వీరులు, వీరనారుల త్యాగాలకు ఈ రోజు నిజమైన నివాళి. ఖమ్మం, వరంగల్, సూర్యాపేట, నల్గొండ ప్రాంతాలలోని ప్రతి పల్లె ఓ రణరంగమే.. ప్రతి ఇల్లు ఓ సైనిక కర్మాగారమే.. ప్రతి వాడా వీరమరణాలకు చిరునామాయే.. ఖమ్మం మధిర ప్రాంతంలోని ఎర్రుపాలెం, బనిగండ్లపాడు, బోనకల్లు మండలంలోని గోవిందాపురం, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో 70 మందికి పైగా వీర మరణం పొందారు. బండ్లకుంట చెరువుకట్ట మీద నలుగురిని రజాకారులు తుపాకులతో నిర్దాక్షణ్యంగా కాల్చి చంపారు. గోవిందాపురంలో ఏడుగురిని సజీవ దహనం చేసిన దుర్మార్గం రజాకారులది.. ఏందుకే ఈ ప్రాంతాల్లోని ఏ వీధిని తట్టినా వీరోచిత స్థూపాలే దర్శనమిస్తాయి.... యోధుల విగ్రహాలే కళ్లముందే నిలుస్తాయి. నల్లమల గిరిప్రసాదు జమలాపురం కేశవరావులు నిర్వహించిన క్యాంపులు నిజంగా యుద్ధ శిబిరాలే.. చూపు మందగించి, వినికిడి మందగించిన ఏ ముదుసలిని కదల్చినా వడిసెల సైన్యం దెబ్బకు పరారయిన రజాకారుల పిరికితనాన్ని గురించి, గుత్ప సైన్యం చేతికర్రల విసురుకు వెన్ను చూపిన నిజాం ముష్కర తుపాకుల చేవలేని తనం గురించి కథలు కథలుగా చెపుతారు. ఇక్కడి ప్రజలు కేవలం వడిసెలను ఆయుధంగా చేసుకొని తుపాకులనెదుర్కొన్నారు. ఇక్కడి వీరులు కేవలం కర్రలను ఆయుధాలుగా చేసి గుత్ప బెటాలియన్ లను తయారు చేశారు. వీటిని గుత్ప సంఘాలని, వడిసేల సైన్యం అని పిలుచుకునేవారు. ఇదంత విశేషం కాదనుకుంటే మధిరలో ఓ కోతి అక్కడికి వచ్చిన రజాకారుల పైకి దాడి చేసి వారికి తన వీరత్వం చూపితే ఆ కోతిని రజాకారులు తుపాకులతో కాల్చి చంపారు. ఇప్పటికి ఆ కోతికి కట్టిన గుడి అక్కడ సజీవంగా ఉంది. అల్లిపురంలో ఆనాడు రజాకారుల దాష్టికానికి ఆహుతి అయిన ఇళ్ల ఆనవాళ్లు ఇంకా నీలి నీడలుగా మిగిలే ఉన్నాయి. తెలంగాణ సాయుధ పోరాటంలో ఉమ్మడి ఖమ్మం నేలలు చిందించిన రక్తం కేవలం గతం కాదు, తరతరాల మానసిక బలానికి ఆయువుపట్టు. తుపాకుల ముందర వడిసెలలతో, కర్రలతో పోరాడటం కేవలం ఆయుధాల యుద్ధం కాదు.. అది అణచివేతపై ఆత్మగౌరవం సాధించిన చారిత్రాత్మక విజయం.

ఆ నాటి వీరుల త్యాగాలు ఎండిన రక్తపు మరకలు కావు, నేటికీ ప్రతి వీధిలో స్మారకస్తూపై వెలుగుతున్న చైతన్య దీపాలు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ప్రాణాలర్పించిన ఆ యోధుల పోరాట స్ఫూర్తిని స్మరించుకోవడమే కాక, వారి బలిదానాలను భవిష్యత్తు తరాలకు అందించడమే మనం ఆ అమరవీరులకు ఇచ్చే నిజమైన, అక్షర నివాళి.

**- నర్వనేని వెంకట్రావు**



# మనిషిలా బతకండి

కాలం ఒకసారి గడిచిపోతే ఇక మళ్ళీ తిరిగిరాదు. ఏ వ్యక్తి ఐతే ఆ కాలంలో జీవిస్తాడో దానిని సద్వినియోగం చేసుకోవాలి. లేదంటే రాబోయే కాలంలో వెనుకబడి పోతాడు. లేదా భవిష్యత్తు ఎలా మారుతుందో ఎవరికి తెలియదు. లేదా మరణమే సంభవించవచ్చు. అందుకే వర్తమానంలో మన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో ఏమి జరిగినా అందరిలో జీవించే ఉంటాము. దీనికి సంబంధించిన ఓ చిన్న కథను చదవండి.

అడవి ప్రశాంతంగా ఉంది. గాలిలో ఆకుల సవ్వడి మెల్లగా వినిపిస్తోంది. రావి చెట్టు కింద బుద్ధుడు ధ్యానంలో నిమగ్నమై ఉన్నాడు. ఆయన చుట్టు భిక్షువులు కూర్చొని ఉన్నారు. కానీ ఒక యువ భిక్షువు మనసులో ఒక ప్రశ్నతో అలజడికి గురవుతున్నాడు. చాలా రోజుల నుండి ఒక ప్రశ్నతో అతడి మనస్సు సంఘర్షణకు గురౌతుంది. 'జీవితపు విలువ ఏమిటి చివరికి మనిషి సాధించేదేమిటి' అనే ప్రశ్న చాలా రోజులుగా తనను కలచివేస్తుంది. చివరికి ధైర్యం తెచ్చుకొని బుద్ధుడిని 'ప్రభూ మనిషి జీవితం ఇంత చిన్నది ఎందుకు? కొందరు ఎక్కువ కాలం బ్రతుకుతారు. మరికొందరు అల్పాయుష్షుతో మరణిస్తారు. మరి ఈ జీవితానికి అర్థం ఏమిటి?' అని బుద్ధుడు కళ్ళు తెరిచాడు. ఆయన ఎదురుగా ఉన్న ఒక చెట్టు వైపు చూశాడు. చెట్టు పెద్దది కాదు. కానీ దాని నీడ చాలా దూరం వరకు వ్యాపించి ఉంది. కొంత మంది ప్రయాణికులు దాని కింద విశ్రాంతి తీసుకుంటున్నారు. కొన్ని పక్షులు దాని కొమ్మల్లో కూర్చొని సేదతీరుతున్నాయి. బుద్ధుడు భిక్షవునుద్దేశించి ఈ చెట్టును చూడు అన్నాడు. ఆ చెట్టు వైపు చూసిన భిక్షువుకి ఆ చెట్టు ఆకులు, కొమ్మలు, కలప మాత్రమే కనిపించాయి. బుద్ధుడు ఈ చెట్టు ఒకప్పుడు విత్తనమే ఎంత పెరుగుతుందో ఎన్ని ఎళ్ళు బ్రతుకుతుందో తెలియదు. ఐన తనపని నిర్వర్తిస్తూనే ఉంది అంటాడు. ఆ మాటలు విన్న యువ భిక్షువు ఆ చెట్టు ఏం పని చేసింది స్వామి? అని మళ్ళీ ప్రశ్నిస్తాడు. బుద్ధుడు చిరునవ్వు నవ్వి ఇది నీడనిస్తుంది, పండ్లను, కలపను ఇస్తుంది, పూలనిస్తుంది. తన నీడలో కూర్చున్న వారు మంచివారా? చెడ్డవారా? తనకు ఆప్తులా, శత్రువులా అని చూడదు. అదే సమయంలో ఒక వృద్ధ యాత్రికుడు వచ్చి బుద్ధుడికి నమస్కరించి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

అతడి కళ్ళలో సంతృప్తి ఉంది. ఈ దృశ్యం చూసిన యువ భిక్షువు ఇంకా అసంతృప్తితోనే ఉండి మళ్ళీ ప్రశ్నిస్తాడు.

బుద్ధుడితో హే భగవాన్ కొన్ని వృక్షాలు చాలా కాలం బ్రతుకుతాయి, మరికొన్ని వృక్షాలు త్వరగా ఎండిపోతాయి. వాటి జీవితం వ్యర్థమైపోతుంది కదా! అంటాడు. బుద్ధుడు భిక్షువు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తన సమీపంలో పడి ఉన్న ఓ "ఎండుటాకును" చేతిలో తీసుకొని ఇది నిరుపయోగమైనదా అని అడిగాడు? ఆ ప్రశ్నకు భిక్షువు మౌనంగా ఉన్నాడు. అప్పుడు బుద్ధుడు ఈ ఎండిన ఆకు రాలడానికి ముందు పచ్చగా ఉండి చెట్టుకు ఊపిరినిచ్చింది.



ఎండిపోవడానికి ముందు ఇది ఆ చెట్టుకు "నీడగా" మారింది. మరి ఇప్పుడు ఇది మట్టిలో కలిసిపోయి ఎరువులా మారి మరో విత్తనానికి జీవం పోస్తుంది. సృష్టిలో ఏది "నిరుపయోగం" కాదు అంటాడు. బుద్ధుడి మాట విన్న యువ భిక్షువుకి లోపల ఏదో మార్పు కనిపించినట్లుగా ఉంది. బుద్ధుడు మనిషి కూడా చెట్టుతో సమానమే అతడు పుట్టడం చావడం అతడి చేతుల్లో లేదు. ఇది ప్రకృతి సిద్ధంగా జరిగే కార్యక్రమం/ప్రకృతి నియమం. కానీ అతని జీవిత కాలంలో సమాజానికి ఏమి ఇస్తాడు అనేది అతడి చేతల్లో ఉంది అంటాడు. భిక్షువుకి తన జీవితంలోని రోజులు గుర్తుకు రాసాగాయి. తను ఎన్నోసార్లు కఠినమైన మాటలు మాట్లాడడం, ఎవరి బాధను పట్టించుకోలేదని అతను ఆలోచించసాగాడు. ఒకవేళ అతని జీవితం వ్యర్థమైతే ఎవరైనా అతని నీడలో ప్రశాంతతను పొందుతారా? అని మళ్ళీ భిక్షువునుద్దేశించి ప్రశ్నిస్తాడు. బుద్ధుని వాక్కు నెమ్మదిగా ఉన్నా అది అంతరాత్మను లోతుగా తాకుతుంది. కొద్ది మంది చాలా కాలం పాటు జీవిస్తారు. కానీ ఎవ్వరికి ప్రశాంతతను ఇవ్వరు.

మరికొద్ది మంది తక్కువ కాలం పాటు మాత్రమే జీవిస్తారు. కానీ చాలా మంది హృదయాలను దోచుకుంటారు. సమాజంపై చెరగని ముద్రవేసి వెళ్ళిపోతారు. ఈ మాటలు విన్న ఆ యువ భిక్షువు కళ్ళు చెమర్చాయి. "జీవితాన్ని సంవత్సరాలతో కాదు ప్రభావంతో కొలవాలి" అని ఆ యువ భిక్షువుకి మొదటిసారి అర్థమైంది. సూర్యుడు నెమ్మదిగా అస్తమిస్తున్నాడు. చెట్టు నీడ మరింత పొడవుగా మారింది. బుద్ధుడు మౌనంగానే ఉండిపోయాడు. ఆ యువ భిక్షువు ఆ వృక్షానికి చేతులెత్తి నమస్కరించి, తన మదిని తొలుస్తున్న ప్రశ్నలకు సరైన సమాధానం లభించిందని గ్రహిస్తాడు. "జీవితపు నిజమైన విలువ మనం ఎంతకాలం జీవించామన్నది కాదు. ఎంత మందిని ప్రభావితం చేశామన్నది ముఖ్యం" అనేది అతడికి స్పష్టంగా అర్థమైంది. ఈ కథ మీకు ఎలాంటి ప్రశ్నలు సంధించిందో మీరు ఇక ముందు ఎలా ఉండాలనుకుంటున్నారో స్పష్టంగా గ్రహిస్తే అంతే చాలు.

బహుజన హితాయా బహుజన సుఖాయ..

ఈ వ్యాసం ఇటీవలే వచ్చిన "మిమ్మల్ని మీరు తెలుసుకోండి " వ్యక్తిత్వ వికాసం పుస్తకం నుండి..



**డా.మహమ్మద్ హాసన్**
అసిస్టెంట్ ప్రొఫెసర్
& పర్సనాలిటీ డెవలప్మెంట్ ఎక్స్పర్ట్

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 17.09.2026
www.mudranews.in | @mudranews



**జొన్నలు / రాగి..**
అవసరాన్ని బట్టి జీర్ణక్రియ, పీచు కోసం జొన్నలు.. కాల్షియం కోసం రాగులు మెరుగైన ఎంపికగా ఉంటాయి. కాబట్టి రెండింటిలో ఒకదానినే ఎంచుకోవాల్సిన అవసరం లేదు. ఆహారంలో మారుస్తూ తీసుకోవడం ద్వారా భిన్నమైన పోషకాలు పొందవచ్చు.



## 22ఏపై ప్రతిపక్షం అబద్ధాలు ప్రచారం చేస్తోంది

**వేముల వీరేశం**



**ముద్ర, హైదరాబాద్:** 22ఏ అంశంపై ప్రధాన ప్రతిపక్షం అసత్య ప్రచారం చేస్తోందని మంత్రి ఆరోపించారు. అసెంబ్లీకి హాజరుకాకుండా ఉండేందుకు కారణాలు వెతుక్కున్నారని, స్పీకర్, పోలీసులను అవమానించారని విమర్శించారు. మాక్ అసెంబ్లీ నిర్వహించినా 22ఏపై చర్చించలేదన్నారు.కేసీఆర్ మాక్ అసెంబ్లీకి కూడా హాజరుకాలేదని, అక్కడ కూడా స్పీకర్ దళితుడే కావడంతోనే ఆయన రాలేదని మంత్రి ఆరోపించారు. మాక్ అసెంబ్లీని జబర్దస్త్ షోలా నిర్వహించారని విమర్శించారు.ధరణి వ్యవస్థలో గత ప్రభుత్వం అనేక అవకతవకలకు పాల్పడిందని మంత్రి ఆరోపించారు. 18 లక్షల ఎకరాల భూముల సమస్యలను పరిష్కరించకుండా మరింత జటిలం చేశారని అన్నారు. ఎల్‌బీనగర్‌లో వాసవికి ప్రభుత్వ భూమిలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. లయోలా కాలేజీకి సంబంధించిన 350 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి ఎలా తొలగించారని నిలదీశారు. కాచిగూడలో వారసులు లేని భూములను ఆక్రమించి ప్రతిమ ఆసుపత్రి నిర్మించారన్న ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాజకీయ లబ్ధి కోసం భూ భారతి చట్టంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. సమగ్ర రెవెన్యూ చట్టాన్ని తీసుకురావడానికి భూ భారతి ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రైతు సంక్షేమం, భూమి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, భూమి హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

## 22ఏపై బీఆర్ఎస్ అవాస్తవ ప్రచారం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**ముద్ర, హైదరాబాద్:** 22ఏ అంశంపై బీఆర్ఎస్ పార్టీ అవాస్తవాలను ప్రచారం చేస్తోందని మంత్రి ఆరోపించారు. ధరణి వ్యవస్థలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షం నిందలు వేస్తోందన్నారు. అధికారుల తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే వాటిని కూడా సరిచేస్తున్నామని తెలిపారు.ధరణిని తీసుకొచ్చి దండుకోవాలని గత ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. హైకోర్టు సూచనల మేరకు కొన్ని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చినట్లు చెప్పారు. కోటి ఎకరాల భూమిని 22ఏలో చేర్చారన్న ప్రచారం అవాస్తవమని, కోర్టు కేసులు, వివాదాలకు సంబంధించిన 3.60 లక్షల ఎకరాల భూములను మాత్రమే నిషేధిత జాబితాలో చేర్చామని స్పష్టం చేశారు.అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మాక్ అసెంబ్లీ నిర్వహిస్తూ చిలిపి చేష్టలు, అల్లర్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. డబ్బు ఉంది కదా అని మాక్ అసెంబ్లీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్, దళితులు, పోలీసులను అవమానిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ధరణిని అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లు తమ ప్రభుత్వం భావిస్తున్న అవకతవకలు, సమస్యలను మరోసారి అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తామని మంత్రి తెలిపారు.

## బేగంబజార్‌లో అద్భుతం.. 48 కిలోల 'బంగారు గణేశుడు'!

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 16:** హైదరాబాద్ బేగంబజార్‌లోని ఫీల్‌ఖానాలో కొలువుదీరిన 48 కిలోల బంగారు గణేశుడి విగ్రహం వినాయక చవితి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్వర్ణ శోభతో మెరిసిపోతున్న ఈ దివ్యమూర్తిని దర్శించేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.సుమారు 3.83 లక్షలకు పైగా అమెరికన్ డైమండ్స్‌తో పాటు 24 క్యారెట్ల బంగారు పూతతో విగ్రహాన్ని అత్యంత శోభాయమానంగా అలంకరించారు. నిపుణులైన కళాకారుల హస్తకళా నైపుణ్యంతో ఈ అరుదైన విగ్రహాన్ని రూపొందించారు.ప్రసిద్ధ లాల్‌బాగ్చా రాజా, తిరుపతి బాలాజీ రూపాల స్ఫూర్తితో స్వర్ణ గణనాథుడిని ప్రత్యేకంగా మలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. బంగారు పూత, వజ్రాల అలంకరణతో రూపొందిన ఈ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.బేగంబజార్‌లోని ఈ స్వర్ణ గణేశుడిని దేశంలోనే అత్యంత ఖరీదైన, అరుదైన వినాయక విగ్రహంగా నిర్వాహకులు పేర్కొంటున్నారు.



# ఆర్థిక ఊబిలో తెలుగు రాష్ట్రాలు




**ముద్ర, హైదరాబాద్ :** ప్రభుత్వాలు మారినా, పాలకులు మారుతున్నా, అప్పులు కుప్ప మాత్రం రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. రెండు ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుకు అప్పులు చేయాల్సి వస్తోందని చెబుతున్నాయి. ఈ అప్పులు ఇలాగే కంటిన్యూ అయితే ఫ్యూచర్‌లో ప్రభుత్వాలు నడపడానికి ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ రాష్ట్రానికైనా ఆర్థిక వ్యవస్థే కీలకం. ఓ రాష్ట్రం ప్రస్తుత పరిస్థితినే కాదు భవిష్యత్తును అంచనా వేయటానికి కూడా ఆర్థిక చక్రమే కీలక ప్రాతిపదిక. ఏటా ఆర్థిక వ్యవస్థలో వృద్ధి కనిపిస్తుందా.. లేదా అనేది ప్రభుత్వాల పనితీరుకు అద్దం పడుతుంది. తెలంగాణలో ప్రస్తుత సర్కారు ఏర్పడి మూడేళ్లు పూర్తైంది. అలాగే ఏపీలోనూ కూటమి సర్కారు రెండేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సమయంలో ఏ రాష్ట్రం ఆర్థిక పరిస్థితి ఏమిటి అనే ఆసక్తి అందరిలోనూ ఉంది. ఓవరాల్‌గా ఏ రాష్ట్రం ఆర్థిక స్థితి కూడా సంతృప్తికరంగా లేదనేది బహిరంగ రహస్యమే. ఏపీకి అప్పులు ఎక్కువగా ఉన్నా.. తెలంగాణకు ఆదాయం తగ్గక పోయినా.. మొత్తం మీద ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. ఈ కారణంగానే రెండు ప్రభుత్వాలూ ఆర్థిక వనరుల సమీకరణపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి వస్తోంది. అటు అప్పులు కూడా పెరుగుతూనే ఉన్నాయి. వీటిని తగ్గించుకోవాలన్నా.. కొత్తగా అప్పులు చేయక తప్పని స్థితి ఉందని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు బహిరంగంగానే చెబుతున్నాయి. కొన్నిసార్లు బహిరంగ సభల్లో కూడా ఈ విషయాన్ని నేరుగా ప్రజలకు అర్థమయ్యేలా చెబుతున్నారు. ఆర్థిక పరిమితులున్నాయి.. వస్తున్న ఆదాయాన్ని బట్టి ఖర్చును నియంత్రించక తప్పదని తేల్చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రభుత్వాలు అప్పులతోనే నడుస్తున్నాయి. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి అటు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు, జగన్మోహన్‌రెడ్డిలు అప్పుల తోనే ప్రభుత్వాలను నడిపించారు. ప్రస్తుత ప్రభుత్వాలు ఆ అప్పులను మరింత పెంచుతూనే ఉన్నాయి. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా కొత్త స్కీంలు ప్రకటించాలన్నా...ప్రభుత్వాలు అప్పు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పు చేస్తే అభివృద్ధి సాధ్యమని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిరంగంగానే చెబుతున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల బడ్జెట్లు చూస్తే అక్షరాలా లక్షల కోట్లలో ఉన్నాయి. ప్రతీ ఏడాది బడ్జెట్ అంకెలు పెరుగుతూనే ఉన్నాయి. కానీ అభివృద్ధి మాత్రం చెప్పిన రేంజ్‌లో కనపడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎన్నికల వేళ ఇస్తున్న హామీలు, పథకాలతో...ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఆర్థికభారం అంతకంతకు పెరుగుతూనే ఉంది. ఆదాయం మాత్రం అంతంగా మాత్రంగానే ఉంది. ఫ్యూచర్‌లో సంక్షేమ పథకాలు అమలు చేయడానికి, ప్రభుత్వాలు నడవడానికి నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.తెలుగు రాష్ట్రాల బడ్జెట్ పరిమాణానికి, ఖజానా పరిస్థితికి ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 3 లక్షల 32 వేల 205 కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను ప్రకటించింది. అయితే ఇందులో లక్ష కోట్ల రూపాయల లోటును కూడా చూపించారు. ప్రతి వారం ఏపీ సర్కారు రిజర్వ్ బ్యాంక్ దగ్గర అప్పులు తెస్తోందని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంపై రూ.11 లక్షల కోట్ల అప్పులు న్నాయనే సమాచారం బయటకొస్తోంది. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం 3,24,234 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో విద్య, వైద్యం, వ్యవసాయం, నీటి పారుదల వంటి ముఖ్య మైన రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. కాంగ్రెస్ మార్క్ పథకా లైనా రైతు భరోసా, చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకాలకు భారీగా నిధులు కేటాయించింది.ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చేసిన వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారి తీశాయి. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు 70 వేల కోట్లుగా ఉండేవని, గత ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచిందని ఆరోపించారు. 70 వేల కోట్ల అప్పును 8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లిందని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు 90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అటు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశా రు. గత ప్రభుత్వం ఎక్కువ వడ్డీకి అప్పు లు తీసుకు రావడంతోనే రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుపోయిందని ఆరోపిం చారు. 2019 వరకు తలసరి అప్పు 74,790 ఉంటే 2024లో అది 1.44 లక్షలకు చేరిందని గుర్తు చేశారు. అప్పులు తీర్చకుంటే రాష్ట్రాన్ని బ్లాక్ లిస్టులో పెడతారని, ఆ తర్వాత ఏపీకి అప్పు పుట్టే పరిస్థితి ఉండదని అన్నారు. అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని తద్వారా సంక్షేమం చేసి మళ్లీ సంపద సృష్టిస్తామన్నారు. రాష్ట్ర ఆదాయం 17.1% నుంచి 9.8 శాతానికి పడిపోయిందని గుర్తు చేశారు. కానీ అప్పులు మాత్రం 16.5% పెరిగాయని చెప్పారు.పదేళ్లలో అన్ని రాష్ట్రాల పబ్లిక్ అకౌంట్ బకాయిలు సగటున 106% పెరిగితే తెలంగాణ లయబిలిటీ మాత్రం 826% పెరిగింది. ఇది దేశంలో అత్యధికం. అన్ని రాష్ట్రాల ఉమ్మడి అప్పులు 190% పెరిగితే...తెలంగాణ అప్పులు 357% పెరిగాయి. ఇది దేశంలో అత్యధికం. 2015-16 నుంచి 2024-25 మధ్యకాలంలో దేశంలోని అన్నిరాష్ట్రాల అంతర్గత అప్పు 205% పెర తెలంగాణ అప్పు మాత్రం 352% పెరిగింది. అత్యధికంగా అంతర్గత అప్పు పెరిగిన రాష్ట్రాల్లో అస్సాం 415%, అరుణాచల్‌ప్రదేశ్ 389%, ఛత్తీస్‌గఢ్ 361% తర్వాతి స్థానంలో తెలంగాణ నిలిచింది. 2024-25 నాటికి తెలంగాణ మొత్తం అప్పులు జీఎస్‌డీపీలో 27.27 శాతానికి చేరాయి. రెవన్యూలోటు -0.57%, ఆర్థిక లోటు -2.98% మేర నమోదైంది. 2024-25లో కేంద్ర పన్నుల్లో వాటాకు ముందు 27,376 కోట్లు, వాటా తర్వాత 47,063 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని 15వ ఆర్థిక సంఘం అంచనావేసింది. వాస్తవంగా 9,420 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడింది.ప్రభుత్వరంగ సంస్థలు, ఎస్‌పీవీలు తీసుకున్న రుణాలకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు జీఎస్‌డీపీలో 2,41,528 కోట్లు 14.72% మేర ఉన్నాయి. ఇది దేశంలోనే అత్యధికం. జీడీపీలో 10శాతానికి మించి గ్యారంటీలు ఇచ్చిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది. 2025 మార్చి 31 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ 16,40,901 కోట్లు ఉండగా, పబ్లిక్ డెట్ 3,91,881 కోట్లుగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 16 రాష్ట్రాలు కలిపి ఇచ్చి పుచ్చుకునే, ఓవర్‌డ్రాఫ్ట్ కింద 6.87 లక్షల కోట్లు ఉపయోగించుకోగా అందులో 1,29,376 కోట్లు వాడుకొని తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 2015 -16 నుంచి 2024-25 మధ్య పదేళ్ల కాలంలో ప్రతి సంవత్సరమూ వేస్ అండ్ మీన్స్, ఉపయోగించుకున్న 9 రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది.

## ఆశ్విని అనుమానాస్పద మృతిపై మానవ హక్కుల కమిషన్ స్పందన

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 16:** రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం కమ్మదనం గురుకులంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆశ్విని అనుమానాస్పద మృతి ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, న్యాయవాది దుండ్ర కుమారస్వామి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా హెచ్ఆర్ కేసు నం. 3641/2026లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు నోటీసులు జారీ చేసింది.ఘటనపై సమగ్ర నివేదికను 2026 నవంబర్ 9లోగా మూడు ప్రతుల్లో సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. విద్యార్థిని మృతికి దారితీసిన పరిస్థితులు, విద్యార్థుల భద్రత, పర్యవేక్షణ, వైద్య సహాయం, సంబంధిత అధికారుల విధుల నిర్వహణ తదితర అంశాలను నివేదికలో వివరించాలని సూచించింది.కమిషన్ తదుపరి విచారణను నవంబర్ 9న ఉదయం 11 గంటలకు చేపట్టనుంది.గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు మరింత పటిష్టమైన వ్యవస్థ అవసరమని దుండ్ర కుమారస్వామి పేర్కొన్నారు. ఆశ్విని మృతి ఘటనపై వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడంతో పాటు గురుకులాల్లో భద్రత, వసతి గృహాల పర్యవేక్షణ, అత్యవసర వైద్య స్పందన, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారం, మానసిక సహాయ వ్యవస్థలపై ప్రత్యేక మానవ హక్కుల ఆడిట్ నిర్వహించాలని ఆయన కోరారు.

## కల్‌హేర్ సబ్‌స్టేషన్‌లో 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ సింక్రొనైజేషన్

**ముద్ర, సంగారెడ్డి, సెప్టెంబర్ 16:** ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్‌ను టీజీఎస్పీడీసీఎల్ విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానించి ఛార్జ్ చేసింది. సంగారెడ్డి జిల్లాలోని 33/11 కేవీ కల్‌హేర్ సబ్‌స్టేషన్ వద్ద మెసర్స్ డాకన్సీ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్ట్‌ను సెప్టెంబర్ 16న సింక్రొనైజ్ చేశారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆకాంక్షలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రోత్సాహం, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మార్గదర్శకత్వంలో టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ జితేష్ వి. పాటిల్ నాయకత్వంలో ప్రాజెక్ట్ అమలులోకి వచ్చింది.సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్), సంగారెడ్డి, డివిజనల్ ఇంజనీర్లు, సాంకేతిక బృందాల సమన్వయంతో సింక్రొనైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి పెరగడంతో పాటు కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణకు దోహదం చేయనుంది. రాష్ట్రంలో మరిన్ని సౌర విద్యుత్ ప్రాజెక్టులను గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## ఎడ్ల బండిలో నిమజ్జనానికి..



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా ప్రతిష్ఠించిన మట్టి వినాయకుని శోభాయాత్ర పురవీధుల గుండా భక్తి శ్రద్ధలతో, భజన బృందాలు, ఆధ్యాత్మిక గీతాలు ఆలపించుకుంటూ సాంప్రదాయ పద్ధతిలో శోభయాత్రను నిర్వహించారు. ఎడ్ల బండి పై మట్టి గణనాథుని ఊరేగింపు చేయడం భక్తులను, చిన్నారులను, యువకులను ఈ శోభయాత్ర విశేషంగా ఆకట్టుకుంది. మట్టి గణనాథుని ప్రతిష్టించడం వల్ల పర్యావరణ పరిరక్షణ కాపాడడంతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను కూడా కాపాడవచ్చు అని హిందూ ఉత్సవ సమితి సభ్యులు పేర్కొన్నారు. ఈ శోభాయాత్రలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షురాలు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, గౌరవ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి బిర్కట్ రఘు, అధికార ప్రతినిధి పర్యాద రామకృష్ణ, కోశాధికారి అంతారం కిరణ్, కమిటీ సభ్యులు, భక్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు

## పెళ్లి నెపంతో మోసం, అక్రమ గర్భస్రావం

**చికిత్స పొందుతూ బాధితురాలు మృతి :నిందితుడి అరెస్ట్**

**ముద్ర కూకట్పల్లి :**పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడమే కాకుండా, గర్భవతి అయిన యువతికి బలవంతంగా అబార్షన్ మాత్రలు ఇచ్చి ఆమె మృతికి కారణమైన ఘటనలో ఓ యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్.టి.సి కాలనీ ప్రాంతానికి చెందిన అరేపు నాగసాయి (26) అనే సౌండ్ ఇంజనీర్, తనకిదివరకే వివాహమైన విషయాన్ని దాచిపెట్టి 30 ఏళ్ల ఒక మహిళతో సన్నిహితంగా మెలిగాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో సదరు మహిళ గర్భం దాల్చడంతో, నిందితుడు ఆమెకు తెలియజేయకుండానే గర్భస్రావానికి (అబార్షన్) ఉపయోగించే మాత్రలు ఇచ్చాడు.మాత్రలు మింగిన అనంతరం తీవ్ర రక్తస్రావం, పొత్తికడుపు నొప్పితో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో బాధితురాలిని కుటుంబ సభ్యులు వెంటనే కేపీహెచ్‌బీలోని హోలిస్టిక్ ఆసుపత్రి ఐసీయూ లో చేర్పించారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు క్రైమ్ నంబర్ 1096/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 69, 89 కింద కేసు నమోదు చేశారు.సాక్ష్యాధారాల ఆధారంగా సెప్టెంబర్ 09, 2026న నిందితుడు నాగసాయిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కమ్యూనికేషన్ కోసం ఉపయోగించిన నిందితుడి వన్‌ప్లస్ మొబైల్ ఫోన్‌ను పంచనామా సమక్షంలో సీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం నిందితుడికి వైద్య మరియు పొటెన్సీ పరీక్షలు నిర్వహించి, న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.కె మెరుగైన చికిత్స కోసం బాధితురాలిని ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సెప్టెంబర్ 14, 2026 సాయంత్రం 19:00 గంటల ప్రాంతంలో ఆమె తుదిశ్వాస విడిచింది.మహిళ మరణించడంతో పోలీసులు కేసును మరింత తీవ్రంగా పరిగణించి, బీఎన్ఎస్ సెక్షన్ 89ను సెక్షన్ 90(2) బీ ఎన్ ఎస్ గా మార్పు చేశారు. ఈ ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు సమగ్ర విచారణ కొనసాగిస్తున్నారు. చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## సర్దార్ పటేల్‌కు నివాళి



**ముద్ర, కూకట్‌పల్లి :**రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కి ఘనంగా నివాళులర్పించారు. 1948లో ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసి, నిజాం పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించిన పటేల్ సేవలను స్మరించుకున్నారు.వసంత్‌నగర్ డివిజన్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నగర్, మూసాపేట్ డివిజన్‌లోని సర్దార్ పటేల్ నగర్‌లలో ఉన్న ఆయన విగ్రహాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నేతృత్వంలో పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరుతూ కూకట్‌పల్లి, బాలానగర్ మండల రెవెన్యూ అధికారులకు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు జరిగిన ఆపరేషన్ పోలోతో తెలంగాణ ప్రజలకు నిజాం విముక్తి లభించిందని, ఈ చారిత్రక ఘట్టం భావితరాలకు తెలియాలంటే సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, వివిధ డివిజన్ల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్వీకేలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ సభ

**ముద్ర, శేరిలింగంపల్లి:** భూమి కోసం, భుక్తి కోసం, ప్రజల విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవ సభను ఈ నెల 17వ తేది గురువారం సాయంత్రం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుపుతున్నట్టు ఎస్వీకే ట్రస్ట్ ప్రకటనలో తెలిపింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు సభ్యులు ఆర్.సాంబశివరావు అధ్యక్షతన జరిగే సభలో విశ్లేషకులు డాక్టర్ అందె సత్యం పాల్గొంటారని, జాగిర్దారులు, నిజాం నవాబులకు జరిగిన వ్యతిరేక పోరాట చరిత్రను స్మరించుకునేందుకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ట్రస్టు పిలుపునిచ్చింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 17.09.2026
www.mudranews.in | @mudranews



## చిరుధాన్యాలు.. మితంగా తీసుకోవాలి

జొన్నలు, రాగులు ఆరోగ్యకర మైనవే అయినప్పటికీ పరిమాణం ముఖ్యం. సమతుల ఆహారంలో భాగంగా కూరగాయలు, పప్పులు, ఇతర ధాన్యాలతో కలిపి తీసుకోవడం మంచిది.



## తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉండదు

**- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్**



**ముద్ర, కరీంనగర్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో ''ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్'' అనే అంశంపై కేటీఆర్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాజకీయాలు, పాలన, సాంకేతికత తదితర అంశాలపై వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ భాజపాతో పొత్తు పెట్టుకునే అవకాశం ఉందా? అని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పందించారు. 'భాజపాతో ఎలాంటి పొత్తు ఉండదు' అని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ అంశంపై మాట్లాడుతూ.. లోక్ సభ స్థానాల సంఖ్యను దేశవ్యాప్తంగా దామాషా ప్రకారం పెంచితే, డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడానికి బీఆర్ ఎస్ కు ఎలాంటి అభ్యంతరం ఉండదని తెలిపారు. ''ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. మొత్తం లోక్ సభ స్థానాలను దామాషా ప్రకారం పెంచితే.. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో మాకు ఎలాంటి సమస్య ఉండదు'' అని పేర్కొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), సాంకేతిక మార్పులపై ప్రశ్నకు సమాధానమిస్తూ.. ప్రతి పెద్ద సాంకేతిక పరివర్తన సమయంలోనూ ఆందోళనలు వ్యక్తమయ్యాయని కేటీఆర్ అన్నారు. ''ప్రతి సాంకేతిక మార్పును ప్రశ్నించారు.. ఏఐ విషయంలోనూ అదే జరుగుతోంది. మనం దాన్ని స్వీకరించి ముందుకు సాగాలి'' అని అన్నారు. కేటీఆర్ తన ప్రసంగంలో తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరించారు. సాగునీరు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాల్లో తెలంగాణ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి కేటీఆర్ వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలోని కరవు ప్రభావిత ప్రాంతాలకు గోదావరి జలాలను ఎలా తరలించాలనే చారిత్రక సవాలుకు ఇంజినీరింగ్ పరిష్కారం ఈ ప్రాజెక్టు అని అభివర్ణించారు. తెలంగాణలో వరి ధాన్యం ఉత్పత్తి 2014–15లో సుమారు 44.4 లక్షల టన్నులు ఉంటే.. 2023–24లో అది 168.8 లక్షల టన్నులకు పెరిగిందని కేటీఆర్ తెలిపారు.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి..

**- చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి**



**ముద్ర, మెదక్ :** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

## పట్టణీకరణతో నగరాలకు వరద ముప్పు

**అందుకే చెరువుల అభివృద్ధికి హైడ్రా ప్రాధాన్యం**
**వైపరీత్యాల వేళ ఆపద మిత్రులు అండగా ఉండాలి**
**యువ ఆపద మిత్రుల శిక్షణలో హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం**

**ముద్ర, హైదరాబాద్ :** పట్టణీకరణతో సహజ నీటి వనరులు, చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని, భారీ వర్షాల సమయంలో వరదల ముప్పు పెరుగుతోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో ప్రభుత్వ విభాగాలతో పాటు యువ ఆపదమిత్రులు కూడా సిద్ధంగా ఉండాలని సూచించారు. నాగోలులోని హైడ్రా శిక్షణ కేంద్రంలో యువ ఆపదమిత్ర 5వ బ్యాచ్ శిక్షణను ప్రారంభించి ఆయన దిశానిర్దేశం చేశారు. నగరంలోని 69 శాతం చెరువులు కబ్జాలకు గురైనట్లు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాల ద్వారా వెల్లడైందన్నారు. చెరువులను పరిరక్షిస్తే వరదలను చాలా వరకు నియంత్రించవచ్చని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడమే కాకుండా, అవి సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే హైడ్రా లక్ష్యమన్నారు. నాలాలు, చెరువుల అభివృద్ధితో వరదలను నియంత్రించవచ్చని పలు ప్రాంతాల్లో ఇప్పటికే నిరూపితమైందన్నారు.అక్రమ నిర్మాణాలు కూడా మానవ తప్పిదాలతో ఏర్పడే వైపరీత్యాలకు కారణమవుతున్నాయని రంగనాథ్ పేర్కొన్నారు. చిన్న స్థలాల్లో భారీ అంతస్తుల భవనాల నిర్మాణం ప్రమాదకరమన్నారు. గచ్చిబౌలి అంజయ్యనగర్ లో ఇటీవల ఏడంతస్తుల భవనం కూలడం, 2024లో సిద్దిఖ్ నగర్ లో భవనం పక్కకు వంగిన ఘటనలను ప్రస్తావించారు.5వ బ్యాచ్ లో హైదరాబాద్ , రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన 117 మంది కళాశాల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. స్థానికంగా ఉండే వీరు సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగి, ప్రభుత్వ విభాగాలకు సమాచారం అందిస్తూ నష్ట నివారణలో ముందుండాలని కమిషనర్ సూచించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్య గారు, అడిషనల్ కమిషనర్లు శ్రీ ఆర్. సుదర్శన్ గారు, శ్రీ డి. ఆనంద్‌కుమార్ గారు యువ ఆపదమిత్రులనుద్దేశించి పలు సూచనలు చేశారు. హైడ్రా ఏడీఎఫ్‌వో శ్రీ మోహన రావు.. వారం రోజుల శిక్షణ సాగే తీరును వివరించారు. హైడ్రా ఆర్ ఎఫ్‌వో శ్రీ జయప్రకాష్ గారు, డీఎఫ్‌వోలు శ్రీధర్ రెడ్డిగారు, గౌతమ్ గారు, మై భారత్ హైదరాబాద్ జిల్లా యూత్ ఆఫీసర్ శ్రీ శషాంక్ గారు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారిణి గ్రీష్మ చంద్రిక గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్..



**ముద్ర, హైదరాబాద్:** భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది.

ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది.

రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్–జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు.

ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్–షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

## ప్రేమ వేధింపులతో యువతి ఆత్మహత్య

**ముద్ర, గోదావరి ఖని న్యూస్:** ప్రేమపేరుతో ఇద్దరు యువకుల వేధింపుల కారణంగా యువతి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన గోదావరిఖనిలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక లెనిన్‌నగర్‌కు చెందిన తాండ్ర అక్షితరాణి (20) మంచిర్యాల జిల్లా నస్పూర్‌కాలనీలో పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదువుతుండగా.. అక్కడ లెక్చరర్‌గా పనిచేసే జెట్టి నవీన్ ప్రేమపేరుతో వేధించసాగాడు. డిప్లొమా అనంతరం అక్షితరాణి సింగరేణి జీడీకే–2 గనిలో అంప్రెంటిస్‌షిప్ చేస్తుండగా.. ఆ గనిలో ఓవర్‌మెన్‌గా పనిచేసే బొమ్మకంటి రవికుమార్ కూడా ప్రేమ వేధింపులకు గురిచేశాడు. శిక్షణ తర్వాత స్థానిక గౌతమినగర్‌లోని కంప్యూటర్ కేంద్రంలో అక్షితరాణి ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 12న ఉదయం 10 గంటలకు ఆమెను తండ్రి కంప్యూటర్ కేంద్రం వద్ద దింపాడు. సాయంత్రం 6 గంటలకు ఫోన్ చేయగా గోదావరిఖని బస్టాండ్ వద్ద ఉన్నానని.. ఇంటికి వస్తున్నట్లు తెలిపింది. గంట తర్వాత మృతురాలి తండ్రికి నవీన్ ఫోన్ చేసి అక్షితరాణి పురుగు మందు తాగిందని చెప్పాడు. కారులో ఆమెను ఇంటి వద్ద దింపి వెళ్లాడు. కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ 13న సాయంత్రం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నవీన్, రవికుమార్‌లపై కేసు నమోదు చేశారు.

# కవులు, కళాకారుల పుట్టిల్లు కరీంనగర్





### మధుపాలీస్ 'క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' పుస్తకం ఆవిష్కరణలో కేంద్ర మంత్రి బండి సంజయ్

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కవులు, కళాకారులకు పుట్టినిల్లుగా నిలుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా తాను పర్యటిస్తున్నప్పటికీ కరీంనగర్‌లో ఉన్నంత మంది కవులు, కళాకారులు మరే జిల్లాలోనూ కనిపించరని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేస్తున్న ఇలాంటి ప్రతిభావంతుల జిల్లాకు ఎంపీగా, కేంద్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు స్కూల్‌లో కవి, రచయిత, ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన 'మధుపాలీస్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' పుస్తకాన్ని బుధవారం బండి సంజయ్ ఆవిష్కరించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలపై మధుసూదన్ రెడ్డి రాసిన వ్యాసాలను సుమారు 400 పేజీల పుస్తకంగా రూపొందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ఈ పుస్తకం విద్యాసంస్థలతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత విశ్రాంతి తీసుకోకుండా సమాజానికి ఉపయోగపడే అంశాలపై మధుసూదన్ రెడ్డి నిరంతరం రచనలు చేయడం అభినందనీయమన్నారు. ఆయనను కలవడం అంటే చరిత్రను, సమకాలీన అంశాలను అధ్యయనం చేయడమేనని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సేవలు, రాజకీయ ప్రస్థానం, దేశానికి చేసిన సేవలపై అనేక విషయాలను పుస్తక రూపంలో తెలుగు ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ అన్నారు. మోదీ చరిత్రను సమగ్రంగా పుస్తకంగా రూపొందించాలని మధుసూదన్ రెడ్డిని కోరారు.

మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఆశీర్వాద దీపాలు వెలిగించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఒక్కో దీపం వెలిగించి మోదీకి ఆశీర్వాదం అందించాలని బండి సంజయ్ కోరారు.

కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, మానేరు స్కూల్స్ అధినేత అనంత రెడ్డి, టీబీఎస్ఎస్ అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి తదితరులు పాల్గొన్నారు.

## గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**ముద్ర, కరీంనగర్ :** మానకొండూరు మండల కేంద్రంలోని పెద్ద చెరువులో నిర్వహించే వినాయక నిమజ్జన ఏర్పాట్లను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మానకొండూరు చెరువు, కొత్తపల్లి మండలంలోని చింతకుంట కెనాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ గణనాథులను తరలించేందుకు భారీ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మానకొండూరు చెరువులో ప్రస్తుతం నీరు తక్కువగా ఉండటంతో అధికారులతో మాట్లాడి నీటిని నింపే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



# కరీంనగర్ గల్లీగల్లీలో రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తాం

**మరో వారం రోజుల్లో డంపింగ్ యార్డ్ పనులకు టెండర్ షురూ...**
**యూసీఎఫ్ నుండి మరో రూ.80 కోట్లను వెచ్చిస్తాం**
**మొత్తం రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ ను అభివృద్ధి చేస్తాం**
**అభివృద్ధిలో కరీంనగర్ కార్పొరేషన్ ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం**
**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి**
**కరీంనగర్ లోని 13, 42, 49 డివిజన్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన కేంద్ర మంత్రి**



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ ప్రజలకు శుభవార్త. డంపింగ్ యార్డ్ పనులకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. స్వచ్ఛ భారత్ స్కీం నిధుల్లో భాగంగా రూ.16 కోట్లతో చేపట్టిన డంపింగ్ యార్డు పనులకు మరో వారం రోజుల్లో టెండర్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ విషయాన్ని ప్రకటించారు. డంపింగ్ యార్డ్ కు సంబంధించి పనులను వేగవంతం చేస్తామన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.840 కోట్లు మంజూరయ్యాయని, అందులో భాగంగా మరో రూ.80 కోట్లను డంపింగ్ యార్డ్ పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు.

ఈరోజు మధ్యాహ్నం కరీంనగర్ 42వ డివిజన్ లోని భగత్ నగర్ మమత థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు. అనంతరం సమీపంలోని పొలాడి ఆనందరావు అపార్ట్ మెంట్ గల్లీలో 50 లక్షల రూపాయల Uidf నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కరీంనగర్ 49వ డివిజన్ లోని భాగ్యనగర్ బాలాజీ సూపర్ మార్కెట్ సమీపంలో రూ.50 లక్షల యూఐడిఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. డివిజన్ లోని పోచమ్మ కమాన్ సమీపంలో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక శ్రీ గాయత్రి అసోయేషన్ ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని దర్శించుకున్నారు.

అక్కడి నుండి కరీంనగర్ 13వ డివిజన్ లోని శివనగర్ బైపాస్ రోడ్ సమీపంలోని లారెల్ స్కూల్ వద్ద కు వెళ్లారు. రూ.75 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు భగత్ నగర్ లో కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే...

యూఐడీఎఫ్ స్కీంలో భాగంగా రూ.50 కోట్ల నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, డ్రెయిన్ అభివృద్ధి పనులను ప్రారంభించుకుంటున్నాం. అందులో భాగంగా ఈరోజు 13, 42, 49 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉంది. పనిచేయని కాంట్రాక్టర్లకు నోటీసులిస్తున్నాం. ఈ విషయంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకుంటుంది.

కరీంనగర్ లోని ప్రతి డివిజన్ లో ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేస్తున్నాం. గల్లీగల్లీలో సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులను పూర్తి చేస్తాం. ఇవేగాకుండా రాష్ట్ర ప్రతిపాదనల మేరకు కేంద్రం రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. త్వరలో ఆ పనులు కూడా ప్రారంభం కాబోతున్నాయి.

మరో శుభవార్త ఏమిటంటే....వారం రోజుల్లో డంపింగ్ యార్డ్ పనులకు సంబంధించి రూ.16 కోట్ల స్వచ్ఛ భారత్ నిధులతో టెండర్ ప్రక్రియ ప్రారంభం కాబోతోంది. యూసీఎఫ్ నిధుల నుండి మరో రూ.80 కోట్లను సైతం డంపింగ్ యార్డ్ పనుల కోసం వెచ్చించబోతున్నాం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 17.09.2026
www.mudranews.in | @mudranews



## రాగులు.. పిల్లలు, పెద్దలకు ఉపయోగకరం

కాల్షియం, ఇతర పోషకాలు లభించే రాగులు అన్ని వయసుల వారికి ఉపయోగపడే చిరుధాన్యం. రాగి సంగటి, రాగి దోశ, రాగి రొట్టె వంటి రూపాల్లో ఆహారంలో చేర్చుకోవచ్చు.



## సేవా సంకల్ప అభియాన్ విజయవంతం చేయండి



**ముద్ర, మోత్కూర్:** ఈ నెల 17 న దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు బిజెపి ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ అనే పేరుతో కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు బిజెపి ఎన్ ఆర్ ఐ జిల్లా కన్వీనర్, సేవా సంకల్పం జిల్లా కన్వీనర్ బయ్యాని చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జాతీయ జెండాలను ఆవిష్కరించి ,సాయంకాలం 6 గంటలకు దేశంలో, రాష్ట్రం లోని అన్ని దేవాలయాల్లో ఆశీర్వాదం దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, సేవా రంగంలో ఉన్న వారిని కలిసి వారికి సత్కారం, రక్తదానం, స్వచ్ భారత్ పేర కార్యక్రమం చేపడతామని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపల్ కేంద్రం అంగడి బజార్ లోని నిరుపేద కుటుంబానికి చెందిన ఆరే జహంగీర్ బ్రెయిన్ డెడ్ తో గత జులై నెలలో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.ఆ కుటుంబం ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో, ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా మన మోత్కూర్ స్వచ్ఛంద సేవా సంస్థ వాట్సాప్ గ్రూప్ దాతల సహకారంతో ఇరువై నాలుగు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం స్థానిక మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న ల చేతుల మీదుగా మృతుని భార్య గీతకు అందజేశారు. నిరుపేద కుటుంబాలకు మన మోత్కూర్ గ్రూప్ ఆర్థిక చేయూత అందించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు,మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి,గ్రంథాలయ చైర్మన్ కోమటి మచ్చగిరి, కౌన్సిలర్ మెంట నగేష్, ప్రతినిధులు ఎం డి షాకీర్,మొరిగాల శ్రీను, కోమటి జనార్దన్,అవిశెట్టి కిరణ్, సుంకిశాల అనిల్,బోయిని యాకు , బుర్ర శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థికసాయం



**ముద్ర, దేవరకొండ:** నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఆదిరాల పరమేష్ కుమార్తె రూప ఇటీవల కరీంనగర్ లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. ఇటీవల తండ్రి మరణంతో రూప చదువుకు ఎవరు సహకరిస్తారని సంశమంలో పడింది. కుటుంబ సభ్యులు కేఎంపి హెల్పింగ్ హాండ్స్ దృష్టికి తీసుకురాగా 30వేల రూపాయలు సేకరించి గురువారం సర్పంచి పసునూరు యుగంధర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు .ఈ సందర్భంగా కొండమల్లేపల్లి సర్పంచ్ మాట్లాడుతూ పట్టుదలతో చదివి భవిష్యత్తులో మంచి వైద్యురాలివి కావాలని ఆదిరాల రూపకు కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డి సూచించారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదని చదువు కోసం ఇలాంటి స్వచ్ఛంద సంస్థలను సంప్రదించాలని భవిష్యత్తులో కూడా సహకరిస్తారని సూచించారు. కే.ఎం.పీ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమని అన్నారు .ఈ కార్యక్రమంలో కొడిదల వెంకటయ్య, ఏరుకొండ రాము, కూన భానుచందర్, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి ,ఎండి లతీఫ్, దండు రవికుమార్, బొడ్డుపల్లి మల్లికార్జున్, బిజిలీ లింగం ,అందుగుల వెంకటేష్, వస్కుల శ్రీను, పర్వతం కొండల్ ,పాల్వాయి సైదులు, వస్కుల ప్రవీణ్, అందుగుల పరమేష్, వెంకటేష్ ,వసుకుల శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఏఓయూలో నూతన కోర్సులు

మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధికి(వీ హబ్) ప్రత్యేక కార్యక్రమాలు
సెప్టెంబర్ 30 వరకు ప్రవేశాలు
డాక్టర్ బి. ధర్మ నాయక్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బిఆర్ఏఓయూ) ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని విశ్వవిద్యాలయ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి. ధర్మ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళాశాల అధ్యయన కేంద్రంలో కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. 2026 – 27 విద్యా సంవత్సరానికి బీఏ, బీకామ్, బీ ఎస్సి, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆదివాసీలకు, ట్రాన్స్ జెండర్ లకు, దివ్యాంగులకు ఎలాంటి ఫీజు లేకుండా ఉన్నత విద్య చదువుకునే అవకాశం వుందని ఆయన తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కోర్సులు విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఆధ్వర్యంలో మారుతున్న కాలానికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కోర్సులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. యూజీ, పీజీ కోర్సులతో పాటు డిప్లొమా, సర్టిఫికెట్, నైపుణ్యాధారిత కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సాంకేతికతను వినియోగించి విద్యను మరింత సులభతరం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. మహిళా విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించి, వారిని భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు బిఆర్ఏఓయూ (వీ హబ్) సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. “మీ ఆలోచనను వ్యాపారంగా మార్చండి.. మేము మీకు సహాయం చేస్తాము” అనే నినాదంతో రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలు, నైపుణ్య శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీతో వివిధ సంస్థలతో ఒప్పందాలు.. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు విద్యార్థులకు చదువుతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ ధర్మ నాయక్ తెలిపారు. ఇప్పటికే టీసీఎస్, ఐకాన్, రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్, రాశి, వి–హబ్ వంటి సంస్థలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గుర్తుచేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి మన కళాశాలలోనే సైన్సు ప్రాక్టికల్ తరగతులు నిర్వహించబడునని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్, కో–ఆర్డినేటర్ డాక్టర్ రమేశ్ గంజి, జాక్టో బొజ్జ బాలయ్య, అధ్యయన కేంద్ర కౌన్సిలర్లు డాక్టర్ బోడ జగన్నాథ్, పన్నాల బాల్ రెడ్డి, ఎన్. సుధ, కనక బాలరాజు, పాండురంగం, ఆసిఫ్ అలీ, లింగమూర్తి, అతర్ ఫరీన్, రత్నపురం బాలరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమంతోనే నాణ్యమైన విద్య సాధ్యం

విద్యా కమిషన్ మాజీ చైర్మన్
ఆకునూరి మురళి




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 16 :** ప్రజలకు నాణ్యమైన విద్య లభించాలంటే రాజకీయ వ్యవస్థపై ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణ మాజీ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. శ్రీధర్ హోటల్‌లో విద్యాభిమానులు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, సామాజిక కార్యకర్తలతో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. ప్రజల నుంచి బలమైన డిమాండ్ లేకుండా ఏ పాలకవర్గం విద్యా వ్యవస్థను సరిదిద్దదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఐసీయూలో ఉందని, ప్రజలే వైద్యులుగా మారి దానిని కాపాడుకోవాలని కోరారు.రాష్ట్రంలో ప్రతి ఏటా 40 లక్షల మంది పిల్లల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి నష్టపోతున్నారని మురళి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా మార్చితే ప్రైవేటు బడులకు వెళ్లే అవసరమే ఉండదని అన్నారు. జాతీయ స్థాయిలో యూడైస్ గణాంకాల ప్రకారం తెలంగాణలో 2,582 పాఠశాలలు ఒకే గదితో నడుస్తున్నాయని, 2,245 పాఠశాలలు సున్నా నమోదుతో మూతపడ్డాయని తెలిపారు. మూతపడిన పాఠశాలల జాబితాలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉండటం శోచనీయమన్నారు. నాణ్యమైన విద్య అందాలంటే విద్యా రంగానికి బడ్జెట్‌లో కనీసం 18 శాతం నిధులు కేటాయించాలని, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు వెంటనే చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ప్రైవేట్ ఫీజుల నియంత్రణ, బడ్జెట్‌లో 18 శాతం నిధుల కేటాయింపు, ప్రతి మండలానికి నాలుగు తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు అనే ప్రధాన డిమాండ్లపై తీర్మానం చేసి, రాబోయే ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. సీనియర్ జర్నలిస్ట్ ఎన్. తిర్మల్ మోడరేటర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మజాషా, మాజీ ఐఏఎస్ ఎం.చంపాలాల్, డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్, వివిధ ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

**ముద్ర, మోత్కూర్:** మోత్కూరు మండలంలోని ముషిపట్ల గ్రామంలో తెలంగాణ సాయిధ పోరాట యోధులు కామ్రేడ్ నేర్లకంటి రామక్క, కామ్రేడ్ నేర్లకంటి రాజమ్మ, కామ్రేడ్ నేర్లకంటి నర్సయ్య అమర వీరుల స్థూపం వద్ద సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి జెండాఎగుర వేసి అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన లో అరాచకాలను ఎదిరించి భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దున్నే వారికి భూమి కావాలని పిలుపునిచ్చి



పోరాటంలో పాల్గొని అమరులైన పోరాట యోధులు ముషిపట్ల గ్రామంలో జన్మించడం మనందరికీ గర్వకారణమని వారి ఆశయ సాధనకు మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య మండల సహాయ కార్యదర్శి పులకరం మల్లేష్ ముషిపట్ల గ్రామ శాఖ కార్యదర్శి ,ఎం డి అబ్బ సాలి .మండల నాయకులు భోయిని ఉప్పలయ్య తాడూరు లక్ష్మి నరసయ్య గొలుసుల యాదగిరి రాజు, నేర్ల కంటి మత్స్యగిరి కుటుంబ సభ్యులు, మెరుగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు

## పేదల ఇళ్ల కూల్చివేత నోటీసులపై ధర్నా

బాధితులకు
పువ్వాడ అజయ్ మద్దతు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 16 :** నగరంలోని చర్చి కాంపౌండ్ బ్రిడ్జిపై 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీవాసులు భారీ ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమ ఇళ్ల కూల్చివేతకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ కాలనీవాసులు రోడ్డుపై ఆందోళనకు దిగడంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దాదాపు 60 ఏళ్లుగా తాము ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఇప్పుడు ఇళ్లను కూల్చివేస్తే తమ పరిస్థితి ఏమిటని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఆందోళన కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కాలనీవాసులకు పూర్తి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరొక ఎజెండా



లేకుండా పోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదలకు కొత్తగా ఇళ్లు కట్టించడం దేవుడెరుగు, ఉన్న ఇళ్లను కూల్చడమే ఎక్కువైందని విమర్శించారు. అభివృద్ధి చేయడం చేతకాక పేదల పొట్ట కొడుతున్నారని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే ఈ కూల్చివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తమ హయాంలో పేదలకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తే, ఇప్పుడున్న ప్రభుత్వం వాటిని కూల్చివేయడమే ఘనతగా భావిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఘనంగా నాయి బ్రాహ్మణుల దినోత్సవం



**ముద్ర, వలిగొండ :** పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం తమ కులదైవమైన ధనవంతురి స్వామికి ప్రత్యేక పూజలు చేసి, కేక్ కట్ చేశారు. 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని, ఉచిత విద్యుత్, రుణాలు మంజూరు చేయాలని ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు నాగేల్లి వలి, పట్టణ అధ్యక్షులు రాచమల్ల విజయ్, మాజీ అధ్యక్షులు నాగేల్లి కృష్ణ, నాగేల్లి నాగేష్, పాండు, ఉమాపతి, నాగేల్లి ప్రభాకర్, సభ్యులు భార్గవ్, వినోద్, దయాకర్, సతీష్, రాచమల్ల ప్రభాకర్, మధు, దినేష్, నాగేల్లి భాను, ప్రజ్ఞాపూర్ విగ్నేష్, కడారి బాలాజీ పాల్గొన్నారు.

## ఖమ్మంలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

మంత్రి తుమ్మల



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 16 :** నగరంలో తలెత్తుతున్న తాగునీటి సమస్యపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. నగరంలోని శ్రీనగర్ కాలనీ, మధురానగర్, రోటరీ నగర్‌తో పాటు పలు కాలనీల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో ఇళ్లలోని బోర్లు పనిచేయడం లేదని ఆయా డివిజన్ల నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించిన తుమ్మల నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లకారం, పుట్టకోట, గొల్లగూడెం చెరువులను వెంటనే నీటితో నింపాలని నీటి పారుదల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో భూగర్భ జలాలు మరింత మెరుగయ్యేలా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, సంప్రదాయ నీటి వనరులను పరిరక్షించే దిశగా అధికారులు చొరవ చూపాలని మంత్రి సూచించారు.

## నెల రోజుల పాటు ‘సేవా సంకల్ప్ అభియాన్’

22ఏ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి
పొంగులేటి సుధాకర్‌రెడ్డి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 16 :** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నెలరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ‘సేవా సంకల్ప్ అభియాన్’ను విస్తృతంగా నిర్వహించనున్నట్లు భాజపా జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభియాన్‌లో భాగంగా రక్తదానం, ఆరోగ్య శిబిరాలు, పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు, మహిళలకు వివిధ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో పార్టీ శ్రేణులు నేరుగా మమేకమవుతాయన్నారురాష్ట్రంలోని భూసమస్యలపై స్పందిస్తూ 22ఏ నిషేధిత భూముల లెక్కలపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 2023 నుంచి ఆగస్టు 2026 మధ్య 22ఏ జాబితాలో 47,440 ఎకరాల విస్తీర్ణం తగ్గడంపై సర్వే నంబర్ల వారీగా స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 980 భూ ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని, ప్రభుత్వ, దేవాదాయ భూములను రక్షించడంతో పాటు మెగా ఫుడ్ పార్క్ ప్రాజెక్టుపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. సమావేశంలో నాయకులు సన్నీ ఉదయ ప్రతాప్, గుత్తా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో సీఎంఆర్ఎఫ్‌కు దుస్థితి

ఎమ్మెల్సీ తాతా మధు



**ముద్ర ప్రతినిధి,ఖమ్మం, సెప్టెంబరు 16 :** కేసీఆర్ హయాంలో పేదలకు ఆపద్బాంధవుడిగా నిలిచిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ విధించి పేదల ప్రాణాలతో చెలగాటమాడుతోందని బిఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో తన సిఫారసు ద్వారా మంజూరైన 72 మంది లబ్ధిదారులకు రూ.15,48,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఆర్థిక సాయం అందించి పేదల ప్రాణాలు నిలబెడితే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోతలు విధిస్తూ నిస్సహాయ స్థితికి దిగజార్చిందన్నారు. రైతులకు ఎరువులు, కరెంట్, ప్రాజెక్టుల నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి మళ్లీ గాడిన పడాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ నాయకులు బెల్లం వేణుగోపాల్, భాషబోయిన వీరన్న, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షోయబుల్లా ఖాన్ కు నివాళి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 16 :** జర్నలిజాన్ని ఆయుధంగా మలుచుకుని నిజాం పాలన, రజాకార్ల దమనకాండపై పోరాడి ప్రాణత్యాగం చేసిన ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్ త్యాగస్ఫూర్తి చిరస్మరణీయమని భాజపా నాయకులు కొనియాడారు. తెలంగాణ విమోచన దిన వారోత్సవాల్లో భాగంగా సుబ్బేడ్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి 'అమర్ హై' అంటూ ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి, హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. తన రచనలతో ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాడి అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని నింపిన మహనీయుడు షోయబుల్లా ఖాన్ అని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత తెలంగాణ కోసం ఆయన చేసిన బలిదానాన్ని నేటితరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రవికుమార్ నున్న, రుద్ర ప్రదీప్, శామ్ రాథోడ్, మేకా సంతోష్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## షోయబ్ కు ఆర్థికసాయం



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపలి పట్టణం 12వ వార్డు బీసీ కాలనీకి చెందిన బీబీ కుమారుడు షోయబ్ అనారోగ్యానికి గురయ్యారు. అతనికి కేఎంపి హెల్పింగ్ హాండ్స్ తరపున దాతల సహకారంతో రూ.30 వేల ఆర్థికసాయాన్ని అందించారు. సర్పంచ్ పసునూరి యుగేందర్ రె, కొడిదల వెంకటయ్య, ఏరుకొండ రాము ,కూన భానుచందర్, అందుగుల వెంకటేష్, వస్కుల శ్రీను, పర్వతం కొండల్, బిజిలి లింగం ,ఎండి లతీఫ్, పాల్వాయి సైదులు, బొడ్డుపల్లి మల్లికార్జున్, వస్కుల ప్రవీణ్, అందుగుల పరమేష్, దండు రవికుమార్, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## మైనార్టీల అభివృద్ధిపై ప్రభుత్వం శీతకన్ను



**ముద్ర, దేవరకొండ:** రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు కేటాయించే నిధులతో అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎండి ఇలియాస్ పటేల్ ఒక ప్రకటనలో ఆరోపించారు. 2025–26 రాష్ట్ర బడ్జెట్లో ప్రభుత్వం మైనారిటీల కోసం రూ.3,006 కోట్లు కేటాయించినట్లు అసెంబ్లీలో పేర్కొన్నా, వాస్తవంగా నిధులు రూ.2,122 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వాటిలో కేవలం రూ.961 కోట్లు ఖర్చు చేసి మిగతా రూ.1,161 కోట్లు దారి మళ్లించారన్నారు. మైనార్టీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమకు ఇది నిదర్శనం అన్నారు. మైనారిటీ గురుకులాలు, మైనార్టీ యువత స్వయం ఉపాధి, విదేశీ విద్యా స్కాలర్ షిప్ లు, మైనార్టీ స్టడీ సర్కిల్, షాదీ ముబారక్ పథకం, హజ్ యాత్రకు, ఇమామ్, మౌజన్ ల వేతనాలు ఇతరాత్ర మైనారిటీ సంక్షేమ పథకాలకు ఉపయోగించాల్సిన నిధులను కేవలం అసెంబ్లీలో గొప్పలకు ప్రకటించి ఆచరణలో ఆ నిధులను ఇతరవైపు మళ్ళించారని పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 17.09.2026
www.mudranews.in | @mudranews



**జొన్నలు / రాగి..**

అవసరాన్ని, బట్టిజీర్ణక్రియ, పీచు కోసం జొన్నలు కాల్షియం కోసం రాగులు మెరుగైన ఎంపికగా ఉంటాయి.



కాబట్టి రెండింటిలో ఒకదానినే ఎంచుకోవాల్సిన అవసరం లేదు. ఆహారంలో మారుస్తూ తీసుకోవడం ద్వారా భిన్నమైన పోషకాలు పొందవచ్చు.

# విమోచన దినంగా జరపకపోవడం దుర్మార్గమైన చర్య

**ఆగస్ట్ 15 తరహాలో పండుగ వాతావరణంలో జరుపుకోవాలి**
**గ్రామ, బూత్ స్థాయిలో ప్రతీ ఒక్కరూ రేపు జాతీయ జెండా ఆవిష్కరించాలి**
**ఎంపి రఘునందన్ రావు పిలుపు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** తెలంగాణ విమోచన దినం జరపకపోవడం దుర్మార్గమైన చర్య అని ఎంపి రఘునందన్ రావు అన్నారు. బుధవారం మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆగస్ట్ 15 తరహాలో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని, గ్రామ, బూత్ స్థాయిలో ప్రతీ ఒక్కరూ జాతీయ జెండా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఉప రాష్ట్రపతి, కేంద్రహోమ్ శాఖ, గవర్నర్, ఇద్దరు కేంద్ర మంత్రులు, తెలంగాణ ఎంపీలు తెలంగాణ ప్రజానీకంతో కలిసి అధికారికంగా సికిందరాబాద్ పరేడ్ మైదానంలో తెలంగాణ విమోచన దినం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ విమోచన కోసం ఎల్.కె. అద్వానీ, బండారు దత్తత్రేయ తదితరులు పోరాటం చేశారన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర తరహాలో తెలంగాణలో కూడా విమోచన దినం జరపాలని డిమాండ్ చేశారు. 10 యేండ్లు పరిపాలన చేసిన మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ తెలంగాణ విమోచన జరుపుతానని మాట ఇచ్చి మోసం చేసి జాతీయ సమైక్య దినం జరపారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విమోచన దినం జరుపుతానని చెప్పిన ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి ప్రజాపాలన దినం జరుపుతున్నారని ధ్వజమెత్తారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజులపాటు సేవ సంకల్ప్ అభియాన్ పేరిట కార్యక్రమలు ఉంటాయని, కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు.2 లక్షల ఇళ్లు మంజూరుతెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని రఘునందన్ రావు తెలిపారు. అంత్యోదయ లక్ష్యంతో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో కేంద్రం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు, మూడు రంగులు వేయడం సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచించాలన్నారు. కేంద్రం మంజూరు చేసిన ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే ఇళ్లలో భాగం కలపాలని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లోగోను ఇళ్లపై తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన వారికే ఇళ్లు ఇస్తే పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చిన అర్హుల జాబితాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలో లేకపోయినా 2 లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు ఇచ్చిన దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే కేంద్రం ఆలోచించాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో ఎంపీలకు ప్రాతినిధ్యం లేకపోతే కేంద్ర నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించుకోవాల్సి ఉంటుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించాలన్నారు. గత మూడు, నాలుగు పంటలుగా సప్లై చేసిన ధాన్యం రైస్ మిల్లులో అట్లే పేరుకుపోయాయన్నారు. కొన్ని మొలకలు వచ్చాయి. కొన్ని ఎలుకలు తిన్నాయి. కొంత తరుగు వచ్చి ఉంటుంది. కొంతమంది రైస్ మిల్ యాజామానులు తప్పు చేసి ఉంటారు. రైస్ మిల్లులకు ఒకరు ఇద్దరు తప్పు చేసి ఉంటే రైస్ మిల్ యాజమానులు అందరు దొంగలు అనడం సరికాదని తెలిపారు. మీరు ఇచ్చిన వడ్లకు మీరే బియ్యం తీసుకోలేదన్నారు. మూడు, నాలుగు పంటలుగా స్టాక్ పెట్టి తర్వాత సివిల్ సప్లై కార్పొరేషన్ కు ఒక ఐపీఎస్ అధికారిని చైర్మన్ గా పెట్టి నక్సలైట్లను, దొంగల్ని పట్టుకున్నట్టుగా రైస్ మిల్ దగ్గరికి వచ్చి వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాష్టంలో ఏం జరుగుతుందో ముఖ్యమంత్రికి తెలుస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర శాసనసభలలో ఇలాంటి సమస్యలు మాత్రం చర్చలకు రావన్నారు. నెల రోజులు అయితే మళ్లీ వడ్లు వస్తాయి. ధాన్యం ఎక్కడపేడతారని ప్రశ్నించారు. రైస్ మిల్ యజమానులు వచ్చి మా దగ్గర ఉన్న బియ్యాన్ని తీసుకెళ్లండి, ధర కట్టియండి, మార్కెట్లో అమ్ముకుంటాం అని అడిగుతే ఆ సమస్యకు సివిల్ సప్లై కార్పొరేషన్ ఎండికి టైం లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**బారికేడింగ్, లైటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**గజ ఈతగాళ్లు, మత్స్యకారులను షిఫ్టుల వారీగా అందుబాటులో ఉంచాలి**
**ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు**





**ముద్ర ప్రతినిధి, మెదక్:** వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. కోంటూరు చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, రాత్రివేళల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు, చిన్న విగ్రహాలు, భారీ విగ్రహాలతో వచ్చే వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసి, అవసరమైన చోట్ల బారికేడింగ్ చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, నిమజ్జన ప్రాంతంలోకి అనవసర వాహనాలను అనుమతించకుండా ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వెంట డియస్పి ప్రసన్న కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, సీఐలు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.సీసీ కెమెరాలతో నిరంతర నిఘారాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశం గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. మెదక్ పట్టణంలోని పలు గణేష్ మండపాలను ఆయన సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ప్రతి మండపం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. విధుల్లో భాగంగా సిబ్బంది నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి, విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వెంట డియస్పి ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# లోధి సామాజిక వర్గం సామాజికంగా అభివృద్ధి చెందాలి

**బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** లోధి సామాజిక వర్గం సామాజికంగా అభివృద్ధి చెందాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. లోధి సామాజిక వర్గనికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆధ్వర్యంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాల లక్ష్మీ రంగులతో మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో బుధవారం పర్యటించారు. లోధి సామాజిక వర్గనికి చెందిన సంఘాల ప్రతినిధులు, ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్లు, వృత్తిపరమైన అవకాశాలు తదితర అంశాలపై వారి అభిప్రాయాలను స్వీకరించారు.లోధి సామాజిక వర్గనికి చెందిన ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించ డంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసు కోవాలని కోరారు. అలాగే తమ సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి తగిన సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ లోధి సామాజిక వర్గం పై సామాజిక వివక్ష తగదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించడం ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. లోధి సామాజిక వర్గనికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, విద్యా ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు. ప్రజలు అందించిన వినతులు, సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి, సంబంధిత అంశాలను కమిషన్ పరిధిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి తగిన నివేదికలు, సిఫార్సులు అందజేస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. లోధి సామాజిక వర్గం వారు పెద్ద శంకరంపేట మండలంలోని ఆరేపల్లి ,పెద్ద శంకరంపేట్, కమలాపూర్ గ్రామాల్లో 43 కుటుంబాలకు గాను 179 మంది ఉన్నారని, రేగోడు మండలంలోని కొత్వాన్ పల్లి గ్రామంలో 19 కుటుంబాలకు 77 మంది మంది ఉన్నారని తెలిపారు.లోధి సామాజిక వర్గం వారి యొక్క కుల దృవీకరణ పత్రం తీసుకొనటలో అవగాహన లేక ప్రస్తుతము వీరు ముదిరాజ్ కులంలో కుల దృవీకరణ పత్రం తీసుకోవడం జరుగుతుందని తెలి పారు. ఆర్డీఓ బిసి సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, తహసిల్దార్ నారా యణ, ఎంపిడిఓ క్రాంతి కుమార్, సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, లోధి కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పద్మావతి ప్లాజాలో ఘనంగా అన్నదానం



**ముద్ర, కూకట్‌పల్లి :** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లిలోని పద్మావతి ప్లాజాలో 'ప్లాజా కా రాజా' పేరుతో ప్రతిష్ఠించిన గణనాథుడి సన్నిధిలో బుధవారం అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. పద్మావతి ప్లాజా గ్రౌండ్ ఫ్లోర్‌లో దాతల సహకారంతో ఈ అన్నసమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, భక్తులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ నిర్వాహకులు, వ్యాపారులు స్వయంగా పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో విలసిల్లాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు.

## గణనాథుని పూజలో డీసీసీ ప్రధాన కార్యదర్శి



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని 3వ వార్డుకు చెందిన తిరుమల నగర్ కాలనీలో కొలువైన విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన గణనాథుని పూజా కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ మేకల రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తిరుమల నగర్ సహకార సంఘం కొండమల్లేపల్లి అధ్యక్షులు చిన మారయ్య , ఉపాధ్యక్షులు మీనా రెడ్డి , ముఖ్య సలహాదారు నీలా లక్ష్మయ్య , ప్రధాన కార్యదర్శి ఆకుతోట లక్ష్మి నారాయణ , ట్రెజరర్ కామిశెట్టి శ్రీనివాస్ , వార్డు సభ్యులు కరుణాకర్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ రెడ్డి , శ్రీనివాస్ , యాదయ్య తదితరులు మేకల రాజేందర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు.ఈ పూజా కార్యక్రమంలో కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :దివ్యాంగుల సంక్షేమానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.బుధవారం మినీ మీటింగ్ హాల్ లో దివ్యాంగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంబంధించి జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ సమావేశం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో దివ్యాంగులకు సంబంధించిన యు డి ఐ డి కార్డులు, సదరం సర్టిఫికెట్లు, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, దివ్యాంగ పిల్లల విద్య, వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలో అర్హులైన దివ్యాంగులందరికీ యు డి ఐ డి కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్యాక్‌లాగ్ ఖాళీలను నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దివ్యాంగ పిల్లలు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.భువనగిరి జనరల్ హాస్పిటల్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సదరం అసెస్‌మెంట్ క్యాంపుల వద్ద దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించేందుకు అటెండెంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.దివ్యాంగులకు ప్రైవేట్ రంగంలో, ముఖ్యంగా ఐటీ మరియు వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగ అవకాశాలు కల్పించేలా యూత్ ఫర్ జాబ్స్ సంస్థతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.దివ్యాంగుల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు.అడిషనల్ యస్ పి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దివ్యాంగుల పై చిన్న చూపు చుస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్ జిల్లా ఉపాధి అధికారి పద్మ , జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వీరన్న , మెప్మా అధికారులు, జిల్లాస్థాయి దివ్యాంగుల కమిటీ సభ్యులు, దివ్యాంగుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బుధవారం ఈవీఎం / వీవీప్యాట్ గోదాం త్రైమాసిక తనిఖీలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంను ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఈవీఎం గోదాం సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా తనిఖీ చేశారు.ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గోదాం భద్రత, పర్యవేక్షణకు సంబంధించిన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. కృష్ణ, డీటీటీ సురేష్ బాబు, సీనియర్ సహాయకులు కె. శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, మజర్, బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏ. ఆంజనేయులు, భువనగిరి పట్టణ అధ్యక్షులు ఏ.వి. కిరణ్ కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీను, బీజేపీ నాయకులు చందా మహేందర్ గుప్తా, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, సీపీఎం నాయకురాలు భట్టుపల్లి అనురాధ, బీఎస్పీ నాయకులు భట్టు రాంచంద్రయ్యతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు

## భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బస్వాపురం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన 97 మంది రైతులకు ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన రైతులను పాలకులు నిర్లక్ష్య వైఖరికి చులకనగా చూస్తున్నారని వారం రోజులలో నిర్వాసితులకు నష్టపరిహారం ప్రకటించకపోతే ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం సీపీఎం భువనగరి మండల కమిటీ ఆధ్వర్యంలో బస్వాపురం ప్రాజెక్టులో సర్వే నెంబరు 229 లోని 110 ఎకరాల 24 గంటల భూమిని కోల్పోయిన 97 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ బస్వాపురం గ్రామం నుండి ముత్తిరెడ్డిగూడెం మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు రైతులతో కలిసి పాదయాత్ర నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి ఇన్‌చార్జు కలెక్టర్‌కు మెమొరాండం సమర్పించి మాట్లాడుతూ బస్వాపురం గ్రామంలోని 97 మంది రైతులు 60, 70 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని నమ్ముకోని ఆ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నా పేద రైతులు ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమ జీవనాధారాన్ని పూర్తిగా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి అనేది మనిషికి ఆర్థికంగా సామాజికంగా ఎంతో విలువైనదిగా ఉపయోగపడుతుందని తెలిపారు. భూమి ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రతను కూడా కల్పిస్తుందని అన్నారు. సమాజంలో భూమి ఉన్నవారికి ప్రత్యేకమైన గౌరవం గుర్తింపు కూడా ఉంటాయని తెలిపారు. జీవనాధారమైన భూమినే ప్రాజెక్టులో కోల్పోతే పాలకులు, అధికారులు నేటికీ ఎలాంటి నష్టపరిహారం రైతులకు చెల్లించకపోవడం చాలా దారుణమని విమర్శించారు. పాలకులు మరియు అధికారుల ఈ ద్వంద్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు గోద శ్రీరాములు మాట్లాడుతూ నిర్వాసితుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద వైఖరి ఆలంబిస్తుందని విమర్శించారు. అభివృద్ధి కోసం, ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులను, నిర్వాసితులను ఎందుకు ప్రభుత్వం ఆదుకోదాన్ని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా మాట్లాడుతూ రాయగిరి రెవెన్యూ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సర్వే నెం. 259లో ప్రభుత్వ భూమి కలిగిన రైతులకు ప్రాజెక్టు కాలువ తీసినప్పుడు నష్టపరిహారం చెల్లించారని అదే పద్ధతిలో బస్వాపురం ప్రాజెక్టులో ప్రభుత్వ భూమిని సాగుచేసు కుంటున్న భూములను కోల్పోయిన 97 మంది పేద రైతులకు కూడా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, సిపిఐ జిల్లా నాయకులు ఏషాల అశోకు, కాంగ్రెస్ నాయకులు చిక్కుల వెంకటేష్, బాలస్వామి ఉడత విష్ణు, అన్నంపట్ల కృష్ణ, మధ్యపురం బాల నరసింహ, నరాల చంద్రయ్య, మచ్చ వెంకట్ నరసయ్య, మచ్చ భాస్కర్, బుర్రు అనిల్, వడ్డెబోయిన వెంకటేష్, పాండాల మైసయ్య, కొండపురం యాదగిరి, చంద్రశేఖరు, రాజమణి, బాలమణి పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555